ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, మే 19, 2026 | సంపుటి - 22 | సంచిక 230 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

- కృషి చేసిన పోలీస్ అధికారులకు సన్మానం
- వారి కృషి అసామాన్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కితాబు

**రాయ్‌పూర్,మే18(నినాదం):** దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్ప మని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గడ్ లోని జగదల్పూర్ లో సోమవారం నాడు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధి కారులను ఆయన సన్మానించారు .తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్ద డంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంను ప్రస్తావించారు.

▸▸తరువాయి2లో..

## మరింత పటిష్టంగా భారత్ నార్వే బంధం

2



- ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం
- ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు
- నార్వే పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన



## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

**ట్రక్కును ఢీకొన్న కంటెయినర్.. పదిమంది మృతి**

మహారాష్ట్రలోని పాల్‌ఘర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లిబ బృందందతో వెళుతున్న ట్రక్కును కంటెయినర్ ఢీకొ నడంతో పదిమంది దుర్మరణం చెందారు.

▸▸ 2లో..



## తొర్రూర్ లో చదరపు గజం రూ.45,500

- బహదూర్ పల్లిలో చదరపు గజం రూ. 40,500
- రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన
- సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం రాక

2 వివరాలు

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతి సాగర్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేత

**హైదరాబాద్, నినాదం:** అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు అందించా లని, సొసైటీలలో సభ్యత్వం తీసుకోనివారికి కూడా ప్రభుత్వం నేరుగా దరఖాస్తులు స్వీకరించి అందరికీ అవకాశం కల్పించాలని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం తరపున రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

▸▸ 2లో..



## భగీరథ్‌పై అదనపు సెక్షన్లు

- మరింత పకడ్బందీగా కేసు విచారణ

**హైదరాబాద్,మే18(నినాదం):** పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై పోలీసులు మరో సెక్షన్ అదనంగా చేర్చారు. బీఎనఎస్ 64(2)(ఓ) సెక్షన్‌ను నమోదు చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడనే ఆరోపణలపై ఈ సెక్షన్ దర్యాప్తు అధికారులు జత చేశారు. దీనిప్రకారం నేరం రుజువైతే పదేళ్లకు మించి జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఒక్కోసారి జీవిత ఖైదు కూడా విధించవచ్చు.

▸▸తరువాయి2లో..

## ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' కీలకం

- తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం
- మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, (నినాదం):** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోం దని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు.

▸▸ 2లో..



## జడ్జి మాధవీదేవిపై తప్పుడు ప్రచారం

**ఒకరిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్, నినాదం:** బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ నేపథ్యంలో న్యాయమూర్తి జస్టిస్ టీ.మాధవీదేవిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన దామోదర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.

▸▸ 2లో..

## ఇమ్రాన్ పదవీచ్యుతిలో అమెరికా పాత్ర?

### సంచలనం కలిగిస్తున్న తాజా వార్తలు

6

**ఇస్లామాబాద్, నినాదం:** ప్రపంచ దేశాలను అల్లకల్లోలంలోకి నెట్టడం అమెరికా నిత్యం చేస్తూనే ఉంటుంది. తన పట్టును కొనసాగించేందుకు అమెరికా చేయని పనులు లేవు. దానికి సలాం అనకుంటే ఆయా దేశాలను అతలాకుతలం చేస్తుంది. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ లాంటి దేశాలు ఇలా విలవిలాడినవే. మనదే శంలోనూ వేలుపెట్టపోయి చేతులు కాల్చు కుందని చెబుతారు. తాజాగా పాక్‌లోనూ ఇలాంటి చర్యలకు దిగినట్లు తాజా వార్తలు రుజువు చేస్తున్నారు.

## జవహర్ నగర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రారంభానికి అనుమతులు

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమస్యల పరిష్కారానికి అధికారుల కృషి చేయండి : మంత్రి శ్రీధర్ బాబు**

**మేడ్చల్ కలెక్టరేట్, మే 18( నినాదం):** జవహర్ నగర్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రే టెడ్ స్కూల్ ప్రారంభానికి పరిపాలనాపరమైన అనుమతులు లభించాయని జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. జిల్లా స్థాయి సమీక్షా సమావేశం లో భాగంగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో వచ్చిన వివిధ సమస్యల పై నిర్మాణాత్మక ఆలోచన చేసి వాటి పరిష్కారా నికి జిల్లా అధికారులందరూ కృషి చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రిదుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు.

▸▸తరువాయి2లో..







## కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

- ఆయనతోపాటు 20 మంది మంత్రులకు ఛాన్స్
- హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, రాహుల్ గాంధీ, ప్రియాంక, ఖర్గే,

2

## మరో ఆరుగురిని హత్య చేసేందుకు ప్లాన్

- జంటహత్యల కేసులో సంచలన విషయాలు
- అప్పులు తీర్చనందుకే ఈ హత్యలు

2

**రంగారెడ్డి, నినాదం:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ జంట హత్యల కేసులో పోలీసుల దర్యాప్తు కొన సాగుతోంది. నిందితుల విచారణలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమకు అప్పు ఇచ్చిన 8 మందినీ చంపేందుకు కరీమా బేగం దంపతులు, మరో వ్యక్తి పథక రచన చేశారు. పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగుచూశాయి.



## బుల్లెట్ వేగంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీ

**అమరావతి, నినాదం:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ భారీ పెట్టుబడితో తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ సీఈఓ గోవింద రాజన్ నేతృత్వంలోని బృందం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా బుల్లెట్ మోటార్ సైకిల్ మోడళ్లను సీఎం పరిశీలించారు.

2 వివరాలు

## రోడ్లపై నమాజ్ చేస్తామంటే కుదరదు

- ముస్లింలకు యూపీ సిఎం యోగీ ఆదిత్యానాథ్ హెచ్చరిక

## గోవులను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

- డిజిపి ఆనంద్‌కు ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

## ఇమామ్‌లు, పూజరులకు గౌరవ వేతనం రద్దు

- బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం
- మత ఆధారిత సంక్షేమ పథకాలు రద్దు
- అన్నపూర్ణ పథకం కింద అర్హులైన మహిళలకు 3వేల సాయం

సువేందు అధికారి నేతృత్వంలోని వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.



# చందానగర్‌లో 'హబీబ్స్' ప్రీమియం సెలూన్ ప్రారంభం



**హైదరాబాద్, బ్యూరో మే 18 (నినాదం ) :**

ప్రముఖ హెయిర్ అండ్ బ్యూటీ బ్రాండ్ 'హబీబ్స్' నూతన ప్రీమియం సెలూన్‌ను చందానగర్‌లో సినీ నటి హిమజ, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సంయుక్తంగా ప్రారంభించారు. అమీన్‌పూర్ రోడ్‌లోని సురక్ష కాలనీ, పద్మజానగర్‌లో ఏర్పాటు చేసిన ఈ సెలూన్‌లో ఆధునిక హెయిర్, బ్యూటీ సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా హిమజ మాట్లాడుతూ, నగరవాసులకు నాణ్యమైన బ్యూటీ సేవలు అందించడంలో హబీబ్స్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ, స్థానికులకు ఈ సెలూన్ ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హబీబ్స్ మేనేజింగ్ డైరెక్టర్ అమన్ హబీబ్ మాట్లాడుతూ, హెయిర్ స్టైలింగ్, హెయిర్ కలరింగ్, బ్రైడల్ మేకప్, ఫేషియల్ తదితర సేవలు అందిస్తున్నామని తెలిపారు. మాస్టర్ ఫ్రాంచైజీ నిర్వాహకులు ప్రశాంత్ లడ్డా, శ్రీకాంత్ రాఠీ మాట్లాడుతూ, 2027 నాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 20కి పైగా బ్రాంచీలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

# షాపర్స్ స్టాప్–హైబ్ ఇండియా 'గెట్ స్పాట్‌లైట్ రెడీ' ప్రారంభం

**హైదరాబాద్, బ్యూరో మే 18 (నినాదం ) :**

షాప్పర్స్ స్టాప్ మరియు హైబ్ ఇండియా భాగస్వామ్యంతో హైదరాబాద్‌లోని ఇన్ ఆర్బిట్ మాల్ లో 'గెట్ స్పాట్‌లైట్ రెడీ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారత తొలి అంతర్జాతీయ గర్ల్ గ్రూప్ ఆడిషన్స్‌కు మద్దతుగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మే 14 నుంచి 22 వరకు జరిగే ఈ ఈవెంట్‌లో ఫ్యాషన్, బ్యూటీ, పాప్ కల్చర్‌కు సంబంధించిన ప్రత్యేక అనుభవాలను యువతకు అందిస్తున్నారు. మే 24న హైదరాబాద్‌లో ఆన్–గ్రౌండ్ ఆడిషన్స్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా షాపర్స్ స్టాప్ ఎండీ, సీఈఓ కవింద్ర మిశ్రా మాట్లాడుతూ భారతీయ ప్రతిభను ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.




# గోవులను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

**డిజిపి ఆనంద్‌కు ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ**

హైదరాబాద్, : తెలంగాణలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. శనివారం రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని.. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని.. హిందువైనా, ఎంఐఎం నాయకులైనా ఒకే విధంగా చూడాలని అన్నారు. గోవుల అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

# కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

**తిరువనంతపురం, నినాదం:**

కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్టా□ల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు.

# జడ్జి మాధవీదేవిపై తప్పుడు ప్రచారం

బండి సంజయ్ కొడుకుకు బెయిల్ ఇస్తే తన భర్తకు చైర్మన్ పదవి ఇస్తారని తప్పుడు ప్రచారం చేశాడు. అసత్య ఆరోపణలు చేసిన వారిపై హైకోర్టు రిజి□స్టార్ బి.ఎస్. చిరంజీవి చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు దామెదర్‌ను అరెస్ట్ చేశారు. ఈ దుష్ప్రచారంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

# మరో ఆరుగురిని హత్య చేసేందుకు ప్లాన్

హత్యకు ప్లాన్ చేసిన 8 మంది మహిళల్లో ఇద్దరిని చంపగా.. మరో ఆరుగురిని కూడా అక్కడికి ఫాంహౌస్‌కు పిలిచారు. వారు అక్కడికి వెళ్లకపోవడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఇద్దరు మహిళల హత్య ఘటన వెలుగు చూసిన తర్వాత తమకూ ప్రాణహాని ఉందంటూ ఆరుగురు మహిళలు పోలీసులను ఆశ్రయించారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆబేదాబేగం, మహబూబాబీ.. అదే కాలనీలో ఉండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువున కు వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. చాలారోజులు అవడంతో డబ్బులు తిరిగివ్వాలని వారిపై మహిళలిద్దరూ ఒత్తిడి తెచ్చారు. దీంతో వారిని చంపేయాలని కరీమాబేగం, రెహమాన్, పథకం వేశారు. డబ్బు ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తరువాత ఆబేదాబేగంను కూడా అక్కడికే తీసుకెళ్లి అదేరీతిలో హత్య చేసి పాతిపెట్టారు. నిందితుల సమాచారంతో తాండూరు గ్రామీణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యాలాల ఎస్సై విఠల్‌రెడ్డి, బషీరాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ పోలీసు సిబ్బంది చేరుకొని తవ్వకాలు చేపట్టగా మహబూబాబీ అస్థిపంజరం బయటపడింది. తరువాత ఆబేదాబేగం మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం నిందితులను విచారించగా.. అప్పు ఇచ్చిన మరో ఆరుగురు మహిళలనూ చంపేందుకు ప్లాన్ చేసినట్లు షాకింగ్ విషయాన్ని వెల్లడించారు.

# రోడ్లపై నమాజ్ చేస్తామంటే కుదరదు

**ముస్లింలకు సిఎం యోగీ ఆదిత్యానాథ్ హెచ్చరిక**

లక్నో : ఇకపై రోడ్లపై నమాజ్ చేయడం ఉదరదని యూపి ప్రభుత్వం హెచ్చరించింది. రోడ్లపై నమాజ్ చేసే ముస్లింలకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక హెచ్చరికలు చేశారు. రోడ్లపై నమాజ్ చేయకుండా సంయమనం పాటించాలని, చట్టం అందరికీ సమానమేని అన్నారు. లఖ్‌నవూలో సోమవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. 'రోడ్లున్నవి ప్రజల రాకపోకల కోసం. వారికి అసౌకర్యం కలిగిస్తే ఊరుకోం. ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలి' అని అన్నారు. మసీదుల్లో షిఫ్టుల ప్రకారం నమాజ్ చేసుకోండి. ఇంట్లో జాగా లేకుంటే దానికి తగ్గట్టుగా జనాభా ఉండేలా చూసుకోండి. జనాభాను పెంచుకోకండి. చట్టం అందరికీ సమానమే. ప్రభుత్వ నిబంధనలు కూడా చట్టంతో సమానం' అని యోగి వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.

# అర్హుడైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలమివ్వాలి..

టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతి సాగర్ నేతృత్వంలో మంత్రిని కలిసి యూనియన్ నాయకులు చర్చించారు. గత 20 ఏళ్లకు పైగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులు సొంత ఇంటి కల సాకారం కోసం ఎదురుచూస్తున్నారని, మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రస్తుత ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతున్న ప్రస్తుత సందర్భాన్ని తమ యూనియన్ ఆహ్వానిస్తుందన్నారు. అయితే సొసైటీలలో సభ్యత్వం తీసుకోకుండా ఉన్న అర్హులైన జర్నలిస్టులకు సైతం నేరుగా ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరించి అందరికీ న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా ఇళ్ల స్థలాల పరిశీలనతో పాటు దరఖాస్తులను పరిశీలించడానికి వేసిన హౌసింగ్ కో ఆర్డినేషన్ కమిటీలో జర్నలిస్టు సంఘాలకు సైతం ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఒక సంఘానికి చెందిన వ్యక్తులే పాల్గొంటే పారదర్శకత లోపించే ప్రమాదం ఉంటుంది కాబట్టి ప్రధాన జర్నలిస్టు సంఘాలకు చెందిన సభ్యులను ఈ కమిటీలో నియమించాలని వారు మంత్రిని కోరగా ఆయన దానికి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో టి యు డబ్ల్యు జె రాష్ట్ర కోశాధికారి పి.యోగానందం, ఐజేయూ నాయకులు అవ్వారి భాస్కర్, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ నవీన్ కుమార్ యారా, ప్రధాన కార్యదర్శి సోమేష్, కోశాధికారి బాపూరావు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న పత్రికల జాబితా కూడా జిల్లాలకు పంపాలి..

భారీ,మధ్య తరహా పత్రికల జాబితా మాత్రమే జిల్లా పౌర సంబంధాల అధికారులకు పంపడం వల్ల జిల్లాల్లో గందరగోళ పరిస్థితి నెలకొందని,చిన్న పత్రికల జాబితాను కూడా వెంటనే జిల్లాలకు పంపాలని కోరుతూ సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుందరెడ్డి గారిని కలిసి వినతిపత్రం అందచేసిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం నాయకులు. వెంటనే అధికారులకు చెప్పి జాబితా పంపిస్తామని హామీ ఇచ్చిన కమిషనర్. కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్, కోశాధికారి యోగానంద్, ఐ జె యు నాయకులు అవ్వారి భాస్కర్, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ నవీన్ కుమార్ యారా, ప్రధాన కార్యదర్శి సోమేష్, కోశాధికారి బాపూరావు తదితరులు ఉన్నారు.



# ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' కీలకం

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నె `లకెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సవి క్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. □`రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గో `డలెన్ అవర'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి?కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ...

# జవహర్ నగర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రారంభానికి అనుమతులు



సోమవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ (ఐ డి ఓ సి) సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ శాసనసభ్యులు మల్లారెడ్డి, ఖుత్బుల్లాపూర్ శాసనసభ్యులు వివేకానంద, మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, కూకట్పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, జిల్లా కలెక్టర్ మను చౌదరి ., మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి , అడిషనల్ కలెక్టర్లు, జోనల్ కమిషనర్లు, మున్సిపల్ చైర్ పర్సన్స్, జిల్లా మార్కెటింగ్ కమిటి చైర్మన్ నర్సింహులుయాదవ్, ఆర్టిఐ కమిటి సభ్యులు జైపాల్ రెడ్డి వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈరోజు మన ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు స్పష్టంగా ప్రజల వద్దకు ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలి దానికి తగిన విధంగా కార్యక్రమాలను రూపొందించుకుని అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి లో పరిష్కారం కాని సమస్యలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ కార్డులు అందించాలని, జనసాంద్రతను బట్టి చౌక ధరల దుకాణాలను పెంచడానికి ప్రతిపాదనలు ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఎండాకాలం సందర్భంలో మంచినీటికి సంబంధించిన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో పీహెచ్సీలు (పీహెచ్సీలు) ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలని, గర్భిణీలు మరియు పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో రాజీ పడకూడదని సూచించారు. గృహ హింసకు గురవుతున్న మహిళలకు అండగా ఉండేందుకు సఖి కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. నేషనల్ హైవే అధికారులు రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన జరిగేలా చెర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు మునిసిపల్ అధికారుల సమన్వయంతో ట్రాన్స్ ఫార్మర్లు మరియు వీధి దీపాలు ఏర్పాటు చేయాలనీ, ఇతర మరమ్మతులు చేపట్టాలన్నారు. హాస్టల్స్ లలో ప్రభుత్వం ప్రతిపాదించిన మెనూ ప్రకారం ఆహారం అందించాలని అన్నారు డబల్ బెడ్ రూమ్ కి సంబంధించి స్థానిక ప్రజలకు ప్రాధాన్యం ఇవ్వాలని శాసన సభ్యులు సూచించారు. జవహర్ నగర్ లోయంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రారంభానికి పరిపాలనా అనుమతులు లభించాయన్నారు. టు బిహెచ్ కె ఇళ్ల మరమ్మతులు, పాత డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో సీలింగ్ లీకేజీ సమస్యలు ఉన్నాయని, వర్షాకాలం దృష్ట్యా వాటిని వెంటనే బాగు చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల సమస్యలను చైర్మన్ లు మంత్రి దృష్టికి తీసుకురాగా వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# ఇమామ్‌లు, పూజరులకు గౌరవ వేతనం రద్దు

కోల్‌కతా, నినాదం:

సువేందు అధికారి నేతృత్వంలోని వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం సీఎం సువేందు అధికారి అధ్యక్షతన బెంగాల్ కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను నిలిపివేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. 2026, జూన్ నుంచి ఈ పథకాలు నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సంక్షేమ కార్యక్రమాలకు మతం రంగు పులమకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని గత టీఎంసీ సర్కార్ ఇమామ్‌లు, ముఅజ్జిన్‌లు, ఆలయ పూజారులకు నెలవారీ గౌరవ వేతనాన్ని అందించిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ఉన్న ఇమామ్‌లకు ప్రభుత్వం నెలవారీ గౌరవ వేతనాన్ని అందించింది. ఈ పథకం కింద ఆర్థికంగా బలహీన వర్గాల నుంచి వచ్చిన ఇమామ్‌లు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందజేసేవారు. అలాగే, మసీదులలో భక్తులను ప్రార్థనకు పిలిచే ముఅజ్జిన్‌లకు కూడా ఇదే విధమైన ఆర్థిక సహాయ అందించారు. ఈ రెండు పథకాలకు నిధులనూ మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి ఇచ్చేవారు. పంపిణీ చేశారు. ఇమామ్‌ల మాదిరిగానే హిందూ పూజారులు లేదా పురోహితుల కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. ఈ పథకం కింద ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన పురోహితులు నెలకు రూ.2 వేల గౌరవ వేతనాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఘోర పరాజయం పాలైంది. దీంతో బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సువేందు అధికారి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు.

# తొర్రూర్ లో చదరపు గజం రూ.45,500

హైదరాబాద్ : రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్ల కొనుగోలుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నది. ఎటువంటి వివాదాలు లేని, అన్ని వసతులతో అభివృద్ధి చెంది మంచి డిమాండ్ తో ఫ్యూచర్ సిటీకి, అవుటర్ రింగ్ రోడ్ కు సవి □పంలో రంగారెడ్డి, మేడ్చల్`మల్కాజిగిరి జిల్లాలలోని తొర్రూర్ (66 ప్లాట్లు), కుర్మల్ గుడ (11), బహదూర్ పల్లి (8) ప్రాంతాల్లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కు చెందిన 85 ఓపెన్ ప్లాట్ల విక్రయానికి సోమవారం నాడు బహిరంగ వేలం నిర్వహించారు. పెద్ద అంబర్ పేట లోని ఒక □ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బహిరంగ వేలంలో పాల్గొన్నబిడ్డర్లు చదరపు గజానికి నిర్దేశించిన దానికంటే అధిక మొత్తంతో ఈ ప్లాట్లను కొనుగోలు చేయడం విశేషం. ఈ ప్లాట్ల విక్రయం ద్వారా సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం వచ్చిందని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతం తెలిపారు. తొర్రూల్ లే అవుట్ లో ప్లాట్ ను కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీలు పడుతూ గరిష్టంగా చదరపు గజం స్థలాన్ని రూ.45,500 (నలభైఐదు వేల అయిదు వందలు)కు వేలం పాటలో కొనుగోలు చేశారని ఎండి శ్రీ వి.పి.గౌతం తెలిపారు. ఓఆరఆర్, ఆదిభట్ల ఐటి క్యారిడార్ కు సవి పంలో ఉన్న తొర్రూర్ లో 200 `700 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 66 ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధర 25 వేల రూపాయలుగా నిర్ధారించగా, సగటున రూ. 32,500 (ముప్పయి రెండు వేల అయిదు వందలు) ధర పలికిందన్నారు. తమకు నచ్చిన భూముల కోసం పోటీ పడుతూ బిడ్డర్లు ఒక దశలో లాట్ ను దక్కించుకోడానికి దాదాపు ఇరవైసార్లు రేట్లు పెంచారంటే ఇక్కడి భూములకున్న డిమాండ్ అర్థంచేసుకోవచ్చు. అదే విధంగా ఎయిర్ పోర్టు, ఆర్సీఐకి దగ్గర్లో ఉన్న కుర్మల్ గుడ లో 200 నుంచి 400 చదరపు గజాల విస్తీర్ణంలోని ఎ లాట్లకు చదరపు గజం కనీస ధర 20 వేల రూపాయలుగా నిర్ణయించగా, గరిష్టంగా రూ.27,500 ధర పలికింది.అవుటర్ రింగ్ రోడ్ ను ఆనుకుని ఉన్న బహదూర్ పల్లి ప్రాంతంలో 200 నుంచి 1000 చదరపు గజాల విస్తీర్ణంలోని `లాట్లకు కూడా మంచి ధర పలికింది. ఇక్కడ చదరపు గజం కనీస ధర 27 వేల రూపాయలుగా నిర్ణయించగా, వేలం పాటలో గరిష్టంగా రూ.40,500 (నలభైవేలు ఐదు వందల) రూపాయల ధర పలికింది. వేలం పాటలో సగటున ఈ భూములకు గజం రూ.33,800కు కొనుగోలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తి పారదర్శకంగా నిర్వహించిన ఈ బహిరంగ వేలం విక్రయాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 150 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ



ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు,మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్ / గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ / మాజీ ఎసఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎసఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. జనవరి 2024లో ఒక అంతర్గత సమావేశంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాలపరిమితిని నిర్దేశిరచుకున్నట్లు వెల్లడించారు.మేం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది □ప్రైవేట్ చర్చల్లో ఇది సాధ్యం కాదంటూ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ మేం స్పష్టమైన ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు సాగాం. మా దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని, వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన కొనియాడారు. 1970వ దశకం నుంచి 31 మార్చి 2026 వరకు దాదాపు మ□డు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం అనే ఒక పీడకలను చవిచూశారని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర రక్తపాతం, అభివృద్ధి నిలిచిపోవడం, యువత భవిష్యత్తు అంధకారమవ్వడం వంటి పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. నక్సలిజం నిర్మూలన పోరాటంలో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాల వల్లే నేడు ఈ విజయం సాధ్యమైందని హోం మంత్రి అన్నారు. క్సలిజం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాదని, తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా దీనిపై ఆందోళన ఉండేదన్నారు.క జీవిత కాలంలో సాధించలేమనుకున్న అసాధ్యమైన లక్ష్యాన్ని, భద్రతా దళాల సమన్వయం మరియు పట్టుదలతో సాకారం చేశామని అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, భద్రతా దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మరింత పటిష్టంగా భారత్`నార్వే బంధం

**న్యూఢిల్లీ,మే18(నినాదం):**

భారత్`నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు.పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్`యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్`ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్`నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇస్రో`నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్`నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.

# భగీరథ్‌పై అదనపు సెక్షన్లు

నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లినప్పుడు.. పోలీసులు హైడ్రామా మధ్య సెక్షన్ 74, 75 అఫ్ బీఎనఎస్, సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్ 2012 మేరకు కేసులు నమోదు చేశారు. ఆ తరువాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు బాధితురాలు నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగడంతో.. ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే దర్యాప్తును చేపట్టిన రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటన గురించి ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగూల్మాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం నేరుగా బాధితురాలిని కలిసి జరిగిన విషయం తెలుసుకున్నారు. పోక్సో కేసు దర్యాప్తులో మహిళా అధికారులు ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితురాలి నుంచి జరిగిన ఘటనకు సంబంధించిన అంశాలను సేకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే రితిరాజ్ నేరుగా బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెతో చాలాసేపు మాట్లాడినట్టు తెలిసింది. బాధితురాలు చెప్పిన విషయాలకు పోలీసులు కేసు నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేని విషయాన్ని ఆమె గుర్తించారు. బాధితురాలు చేసిన ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6ల పరిధిలోకి వస్తాయి. బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడి జరిగినట్టు ఆరోపణలుంటే ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని చట్టం సూచిస్తున్నది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా జరిగిన నేరం అత్యంత తీవ్రమైనదని గ్రహించిన డీసీపీ ఆ మేరకు కేసులో సెక్షన్లను అలర్ట్ చేయించారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జోడించారు. సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే.. నిందితుడికి 20 ఏండ్లకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశాలున్నాయి.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

**ముంబై,మే18(నినాదం):**

మహారాష్ట్రలోని పాల్‌ఘర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లిఒ బృందందతో వెళుతున్న ట్రక్కును కంటెయినర్ ఢీకొనడంతో పదిమంది దుర్మరణం చెందారు. ముంబై `అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 10 మందికిపైగా మృతిచెందగా, మరో 25 మందికి పైగా గాయపడ్డారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రక్కును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతింది. ఘటనాస్థలిలోనే పదిమందికి పైగా మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సవి□ప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అతివేగం, నిర్లక్ష్య □డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాద ఘటనతో పెళ్లి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.

## ఇమ్రాన్ పదవీచ్యుతిలో అమెరికా పాత్ర?

### సంచలనం కలిగిస్తున్న తాజా వార్తలు

ఇస్లామాబాద్ : ప్రపంచ దేశాలను అల్లకల్లోలంలోకి నెట్టడం అమెరికా నిత్యం చేస్తూనే ఉంటుంది. తన పట్టును కొనసాగించేందుకు అమెరికా చేయని పనులు లేవు. దానికి సలాం అనకుంటే ఆయా దేశాలను అతలాకుతలం చేస్తుంది. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ లాంటి దేశాలు ఇలా విలవిల్లాడినవే. మనదేశంలోనూ వేలుపెట్టపోయి చేతులు కాల్చుకుందని చెబుతారు. తాజాగా పాక్‌లోనూ ఇలాంటి చర్యలకు దిగినట్లు తాజా వార్తలు రుజువు చేస్తున్నారు. పాక్ ప్రధాని పదవి నుంచి ఇమ్రాన్ ఖాన్‌ను తొలగించడం వెనుక అమెరికా హస్తం ఉందని వెల్లడించే రహస్య దౌత్య సమాచారం తాజాగా లీక్ అయ్యింది. దీనికి సంబంధించిన అసలు పత్రాన్ని ఇన్వెస్టిగేటివ్ పత్రిక డ్రాప్ సైట్ ప్రచురించింది. ఇందులో వెల్లడించిన వివరాల ప్రకారం.. 2022, ఏప్రిల్‌లో ఇమ్రాన్‌ఖాన్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అంతకు ముందు అమెరికాలోని పాకిస్థాన్ రాయబారి అసద్ మజీద్ ఖాన్‌తో అమెరికా హోంశాఖలోని దక్షిణ`మధ్య ఆసియా వ్యవహారాల సహాయ కార్యదర్శి డోనాల్డ్ లూ సమావేశమయ్యారు. అందులో వారు ఇమ్రాన్‌ను పదవి నుంచి తొలగించి జైల్లో పెట్టాలని.. అప్పుడే అమెరికా`పాక్ బంధం మరింత బలపడుతుందని చర్చించుకొన్నట్లు తెలుస్తోంది. అనంతరం ఇమ్రాన్ ఖాన్ ప్రధాని పదవి నుంచి వైదొలగడంతో షెహబాజ్ షరీఫ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. రష్యా`ఉక్రెయిన్ మధ్య యుద్ధం విషయంలో ఇమ్రాన్‌ఖాన్ తటస్థ వైఖరి కారణంగానే ఆయన్ను ప్రధాని పదవి నుంచి తప్పించాలని అమెరికా నిర్ణయించినట్లు పాకిస్థాన్‌లో లీకైన దౌత్య సమాచారం వెల్లడించింది. పాక్ రాయబారి, అమెరికా ప్రభుత్వాధికారుల మధ్య భేటీకి ముందు.. ఇమ్రాన్ ఖాన్ పాకిస్థాన్‌లో భారీ ర్యాలీ చేపట్టారు. తనను పదవి నుంచి తొలగించడానికి స్థానిక పార్టీలు, అధికారులతో కలిసి అమెరికా కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కాగా ఆయన వ్యాఖ్యలను పాక్ ప్రభుత్వం, అమెరికా ఖండించాయి. అనంతరం తోషాఖానా కేసులో ఆయనకు జైలు శిక్ష పడింది. నాటినుంచి ఇమ్రాన్ జైల్లోనే ఉన్నారు. ఇటీవల ఆయనపై హత్యాయత్నం కూడా జరిగిందని వార్తలు వచ్చాయి. మొత్తంగా అమెరికా తీరుతో ప్రపంచ దేశాలు అప్రమత్తంగా ఉండకుంటే అంతే సంగతులు.

## అధిక జేష్ఠ్యం..ఆరంభం

### శుభకార్యాలకు అనువు కాదు

తిరుపతి :

ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ఆరంభమయ్యింది. అధిక మాసం అంటే అనే సందేహాలు వస్తుంటాయి. ఒకే సంవత్సరంలో ఒకే పేరున్న మాసం రెండు సార్లు వస్తే మొదటిదాన్ని అధికం అని, రెండవదాన్ని నిజమాసమని, శుద్ధం అని అంటారు. హిందూ పంచాంగం చంద్రుడి గమనాన్ని అనుసరిస్తుంది, అయితే గ్రెగోరియన్ క్యాలెండర్ సూర్యుని ఆధారంగా ఉంటుంది. చాంద్రమాన సంవత్సరం సుమారు 354 రోజులు ఉండగా, సౌర సంవత్సరం 365 రోజులు ఉంటుంది. ఈ రెండు మధ్య వచ్చే వ్యత్యాసం వల్ల ప్రతి సంవత్సరం 10,11 రోజుల తేడా ఏర్పడుతుంది. ఈ తేడా ఒక నెలకు చేరినప్పుడు, సుమారు 3 సంవత్సరాలకు ఒకసారి అదనపు నెలను జోడిస్తారు. దానినే అధిక మాసం అంటారు. ఇది కాలమానం సమతుల్యతను కాపాడడంలో సహాయపడుతుంది. మతపరంగా ఇది ఆధ్యాత్మిక సాధనకు అత్యుత్తమ సమయంగా భావించబడుతుంది. ఈ ఏడాది మే 17, ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం అయ్యింది. 'అసంక్రాంతి మాసో అధికమాసః' అని సనాతన ధర్మశాస్త్రంలో వివరించి ఉంది. అంటే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రయాణించడాన్ని సంక్రమణం లేదా సంక్రాతి అంటారు. ఏ మాసంలో అయితే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రవేశించడో ఆ మాసాన్ని అధిక మాసమని అంటారు. పురాణ కథల ప్రకారం, ఈ అదనపు మాసాన్ని మొదట మల మాసం అని పిలిచేవారు. దానిని శుభకార్యాలకు అనుకూలంగా భావించలేదు.

# పరిపాలనా వ్యయం వర్సెస్ ప్రజా సంక్షేమం!

ప్రజాస్వామ్య పరిపాలనలో ప్రజా సంక్షేమానికి, పరిపాలనా వ్యయానికి మధ్య సమతుల్యత సాధించడం ఎప్పుడూ ఒక పెద్ద సవాలే. ముఖ్యంగా ఎన్నికల సమీకరణాలు, రాజకీయ ప్రయోజనాల నేపథ్యంలో ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు రాష్ట్ర ఆర్థిక శ్రేయస్సుపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయనే చర్చ తెలంగాణలో పునరావృతమవుతోంది. గతంలో ముందస్తుగా పీఆర్సీ ఏర్పాటు చేయడం, ఐదు శాతం మధ్యంతర భృతి ప్రకటించడం వంటి నిర్ణయాల వెనుక ఉద్యోగులను మచ్చిక చేసుకునే వ్యూహాలు ఉన్నాయనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ సమయాల్లో ప్రధాన పార్టీలు సైతం 20 శాతానికి పైగా ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. అయితే, పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో నడిచే ప్రభుత్వాలు కేవలం ఒక వర్గం ఒత్తిళ్లకు తలొగ్గితే.. మిగిలిన సమాజ సంక్షేమం, మౌలిక వసతుల కల్పన వంటి కీలక రంగాలు కుంటుపడతాయనే ఆందోళనలు సగటు పౌరుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

పదేళ్ల ప్రస్థానంలో పెరిగిన ఆర్థిక భారం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఉద్యోగుల వేతన సవరణలు భారీ స్థాయిలో జరిగాయి. స్వరాష్ట్ర ఉద్యమంలో ఉద్యోగులు పోషించిన చారిత్రక పాత్రను గౌరవిస్తూ 2015లో పీఆర్సీ సిఫారసులతో నిమిత్తం లేకుండా 'తెలంగాణ ఇంక్రిమెంట్'తో కలిపి ఏకంగా 43 శాతం ఫిట్ మెంట్ ప్రకటించారు. ఆ తర్వాత 2020లో సీఆర్ బిశ్వాల్ నేతృత్వంలోని మొదటి పీఆర్సీ కమిటీ కేవలం 7.5 శాతం సిఫారసు చేసినప్పటికీ.. రాజకీయ సమీకరణాల దృష్ట్యా ప్రభుత్వం దానిని 30 శాతానికి పెంచి అమలు చేసింది. దీనివల్ల అప్పట్లోనే బడ్జెట్‌పై రూ.12,595 కోట్ల అదనపు భారం పడింది. ఆ తదనంతరం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శివశంకర్ నేతృత్వంలో రెండవ పీఆర్సీని ఏర్పాటు చేయడం, దానికి అనుగుణంగా 5 శాతం మధ్యంతర భృతిని ప్రకటించడం వల్ల మరో రూ. రెండు వేల కోట్లకు పైగా భారం పడింది. దేశంలోనే ప్రభుత్వ ఉద్యోగులకు అత్యధిక వేతనాలు ఇస్తున్న రాష్ట్రాలలో తెలంగాణ అగ్రశ్రేణిలో (కేరళ తర్వాత రెండవ స్థానంలో) కొనసాగుతున్నప్పటికీ, ఉద్యోగ సంఘాల నుంచి డిమాండ్లు నిరంతరాయంగా వస్తూనే ఉన్నాయి. రాబడిలో సింహభాగం వేతనాలు, పెన్షన్లకే రాష్ట్ర ప్రభుత్వాల సొంత రాబడిలో సగానికి పైగా నిధులు కేవలం వేతనాలు, పెన్షన్లు, మరియు పాత అప్పుల వడ్డీల చెల్లింపులకే సరిపోతున్నాయని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తన నివేదికలలో నిరంతరం ఎత్తి చూపుతోంది. కాగ్ గణాంకాలను పరిశీలిస్తే.. 2016–17 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర మొత్తం ఆదాయం రూ.81,432 కోట్లు కాగా, అందులో ఉద్యోగుల వేతనాల కోసమే రూ.30,930 కోట్లు (సుమారు 38 శాతం) ఖర్చయింది. 2022 నాటికి ఈ కేటాయింపులు రూ.44,400 కోట్లకు చేరాయి. ప్రస్తుత 2026 ఆర్థిక సంవత్సర పరిణామాలను పరిశీలిస్తే.. తెలంగాణ బడ్జెట్ వ్యయం రూ.3 లక్షల కోట్ల మైలురాయిని దాటి (సుమారు రూ.3.24 లక్షల కోట్లకు) పెరిగిన నేపథ్యంలో, వేతనాలు మరియు పెన్షన్ల కోసం కేటాయించాల్సిన బడ్జెట్ అంచనాలు సైతం రూ.55,000 కోట్ల మార్కును దాటిపోయాయి. రాబోయే రోజుల్లో కొత్త పీఆర్సీ నివేదిక పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే ఈ వ్యయం మరింత పెరిగి, మొత్తం బడ్జెట్‌లో దాదాపు ఐదో వంతు (20 శాతానికి పైగా) కేవలం కొద్ది శాతం ఉన్న ప్రభుత్వ సిబ్బంది కోసమే కేటాయించాల్సి వస్తుంది.

ఓటమి భయం వర్సెస్ రాజకీయ లెక్కలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సత్సంబంధాలు దెబ్బతింటే ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వస్తుందనే భయం రాజకీయ పార్టీలను వెంటాడుతుందనే వాదనకు చరిత్రలో అనేక ఉదాహరణలు ఉన్నాయి. 1974లో ప్రధాని ఇందిరా గాంధీ రైల్వే ఉద్యోగుల సమ్మెను ఉక్కుపాదంతో అణచివేసినా, ఆ తదనంతర రాజకీయ పరిణామాలు ప్రభుత్వ మార్పునకు దారితీశాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1978లో మర్రి చెన్నారెడ్డి, ఆ తర్వాత 1986లో ఎన్టీ రామారావు ప్రభుత్వాల హయాంలో జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ సమ్మెలు ఆయా ఎన్నికల ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అలాగే 2002లో తమిళనాడులో జయలలిత ప్రభుత్వం సమ్మె చేసిన 1.75 లక్షల మంది ఉద్యోగులను ఆర్డినెన్స్ ద్వారా తొలగించిన తదనంతరం జరిగిన ఎన్నికల్లో తీవ్ర ప్రతికూల ఫలితాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ చారిత్రక భయాల వల్లే.. సంక్షేమ పథకాలకు నిధుల కొరత ఏర్పడుతున్నప్పటికీ, పార్టీలు ఓటర్లను ప్రభావితం చేయగల ఉద్యోగ వర్గాల డిమాండ్లకు తలొగ్గుతున్నాయనే విమర్శలు క్షేత్రస్థాయిలో బలంగా వినిపిస్తున్నాయి.

వ్యవస్థాగత సంస్కరణలే సమతుల్య పరిష్కారం

శాంతిభద్రతల పరిరక్షణ, గ్రామీణ విద్యా–వైద్య సేవల విస్తరణ, సంక్షేమ పథకాల క్షేత్రస్థాయి అమలు, మరియు విపత్తు నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యుల పాత్ర అత్యంత కీలకమైనది. కాబట్టి, వారి జీవన భద్రతను పూర్తిగా విస్మరించడం సాధ్యం కాదు. అయితే సమస్య వేతనాలు పెంచడంలో లేదు; పెరుగుతున్న వేతనాలకు అనుగుణంగా పౌర సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరగకపోవడంలోనే ఉంది. డిజిటల్ గవర్నెన్స్, నిర్దేశిత కాలపరిమితి సేవలు, బయోమెట్రిక్ హాజరు వంటి ఆధునిక సంస్కరణలను పటిష్టంగా అమలు చేయాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన యజమానులైనప్పుడు.. పన్నుల రూపంలో వచ్చే ప్రజాధనం కేవలం పరిపాలనా వ్యయానికే పరిమితం కాకుండా, సమాజంలోని చివరి నిరుపేద వాడి సంక్షేమానికి, మౌలిక వసతుల కల్పనకు సమానంగా పంపిణీ అయినప్పుడే 'స్వరాష్ట్ర' ఆశయాలకు నిజమైన సార్థకత లభిస్తుంది.

**ఉక్కల్కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170**

# మాయల మరాఠీ.. కిస్కా జేబ్ ఖాళీ?

**రాజకీయ వేదికపై "ఉచితాల రాజకీయం" మరోసారి చర్చనీయాంశమవుతోంది. సరికొత్త రాజకీయ ప్రత్యామ్నాయాల పేరుతో బాల్యదశ నుంచి ఉన్నత చదువుల వరకు ఉచిత ప్రైవేట్ విద్య, కార్పొరేట్ స్థాయి వైద్యం, నిరుద్యోగ యువతకు ₹2 లక్షల నుంచి ₹20 కోట్ల వరకు రుణ సాయం అంది స్తామనే హామీలు రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. 2026 ఫిబ్రవరి 13న ముగిసిన స్థానిక ఎన్నికల ధోరణులు ఈ హామీలకు ప్రజల్లో ఆకర్షణ పెరుగుతోందని సూచిస్తున్నప్పటికీ, వాటి ఆర్థిక సాధ్యతపై నిపుణుల వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భారత రిజర్వ్ బ్యాంక్ ఫిబ్రవరి 2026 "స్టేట్ ఫైనాన్సెస్" నివేదిక ప్రకారం రాష్ట్రాల ఆదాయంలో అధిక భాగం అప్పుల వడ్డీలు, జీతభత్యాలు, పెన్షన్లకే వెచ్చించబడుతోంది.**

**తెలంగాణ 2026 బడ్జెట్ వ్యయం ₹3 లక్షల కోట్లకు చేరువవుతున్న నేపథ్యంలో, కొత్త సంక్షేమ హామీల అమలుకు అవసరమైన అదనపు నిధులు ఎక్కడి నుంచి సమీకరించబడతాయన్న ప్రశ్న ప్రధాన చర్చగా మారింది. మరోవైపు, ప్రైవేట్ విద్య, వైద్యం సామాన్య కుటుంబాలకు అందని స్థాయికి చేరుకోవడంతో ప్రభుత్వ జోక్యం అవసరమని సంక్షేమవాదులు వాదిస్తున్నారు. దీంతో ఇప్పుడు అసలు చర్చ "హామీలు అవసరమా?" అన్న దానికంటే, "అవి ఆర్థికంగా నిలదొక్కుకోగలవా?" అన్న అంశంపైనే కేంద్రీకృతమవుతోంది.**

పన్నుల భారం.. చివరకు చెల్లించేది ప్రజలేనా?

రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వ్యవస్థలో పన్నులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. తెలంగాణ ఆర్థిక పత్రాల ప్రకారం సరుకులు–సేవల పన్ను, అబ్కారీ ఆదాయం, భూముల రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇంధన వ్యాట్ ప్రధాన ఆదాయ వనరులుగా కొనసాగుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరల్లో కేంద్ర–రాష్ట్ర పన్నుల వాటా గణనీయంగా ఉండటంతో సామాన్యుడిపై భారం పెరుగుతోందని ఆర్థిక విశ్లేషణలు సూచిస్తున్నాయి. నిర్మాణ సామగ్రిపై ఉన్న అధిక పన్నుల ప్రభావంతో మధ్యతరగతి కుటుంబాల గృహ నిర్మాణ వ్యయాలు కూడా పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వాలు బహిరంగ మార్కెట్ నుంచి అధికంగా అప్పులు సేకరించడం వల్ల బ్యాంకింగ్ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు అందుబాటులో ఉండే రుణ సామర్థ్యం తగ్గే అవకాశం ఉందని రిజర్వ్ బ్యాంక్ అధ్యయనాలు సూచిస్తున్నాయి. దీని ప్రభావం చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ విద్యా సంస్థల నాణ్యతపై ప్రశ్నలు కొనసాగుతున్న తరుణంలో పేదలకు ప్రత్యామ్నాయ భరోసా అవసరమని సంక్షేమవాదులు స్పష్టం చేస్తున్నారు. దీంతో "ఉచితం" అనే పదం వెనుక ఉన్న అసలు ఖర్చు చివరకు పన్నుల రూపంలో ప్రజల జేబుల నుంచే వెళ్తుందా? అన్న ప్రశ్న మరింత బలంగా వినిపిస్తోంది.

**అనుభవాలు చెబుతున్న ఆర్థిక హెచ్చరికలు!**

ప్రపంచ ఆర్థిక చరిత్రను పరిశీలిస్తే, నియంత్రణలేని సంక్షేమ వ్యయాలు, అధిక అప్పులు అనేక దేశాలను తీవ్ర సంక్షోభాల్లోకి నెట్టిన ఉదాహరణలు కనిపిస్తాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి 2025 ఏప్రిల్ నివేదిక ప్రకారం, ఆర్థిక వనరులను పరిగణలోకి తీసుకోకుండా ఇచ్చే ప్రజాకర్షక హామీలు దీర్ఘకాలిక స్థిరత్వాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించింది. గ్రీస్ అప్పు సంక్షోభం, లాటిన్ అమెరికాలోని కొన్ని దేశాల్లో సంక్షేమ రాజకీయాల కారణంగా ఏర్పడిన ద్రవ్యోల్బణ పరిస్థితులు ప్రపంచానికి హెచ్చరికలుగా నిలిచాయి. దీనికి భిన్నంగా సింగపూర్, దక్షిణ కొరియా, వియత్నాం వంటి దేశాలు పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, ఎగుమతుల ఆధారిత ఆర్థిక విధానాలతో వేగంగా ఎదిగాయి. ప్రపంచ బ్యాంక్ నివేదికల ప్రకారం, విద్య, ఆరోగ్య రంగాల్లో పెట్టుబడులు అవసరమైనప్పటికీ, అవి స్థిరమైన ఆదాయ వనరులతో అనుసంధానించకపోతే భవిష్యత్ తరాలకు అప్పుల భారంగా మారే ప్రమాదం ఉంది. తెలంగాణ వంటి యువ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాల్లో పరిశ్రమలు, స్టార్టప్‌లు, నైపుణ్య శిక్షణ కేంద్రాలపై పెట్టుబడులు పెరిగితే శాశ్వత ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని నిపుణులు సూచిస్తున్నారు.

తాత్కాలిక తాయిలాలు.. దీర్ఘకాల సవాళ్లు!

ప్రజాస్వామ్యంలో హామీలు సహజమే. కానీ ప్రతి హామీ వెనుక ఆర్థిక వనరులు, అమలు సామర్థ్యం, దీర్ఘకాల ప్రభావం కూడా అంతే ముఖ్యం. ఎన్నికల హామీలకు సంబంధించిన నిధుల వనరులను ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలన్న భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. "సంక్షేమం అవసరం.. ఆర్థిక క్రమశిక్షణ అంతకంటే అవసరం" అన్న నిపుణుల హెచ్చరిక కూడా ఇదే వాస్తవాన్ని గుర్తు చేస్తోంది. గ్రామీణ పేదలు, నిరుద్యోగ యువత, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ భరోసా అవసరమే అయినప్పటికీ, తాత్కాలిక ఉపశమనానికి ఇచ్చే హామీలు భవిష్యత్ తరాలపై అప్పుల భారంగా మారకూడదన్న ఆందోళన కూడా పెరుగుతోంది. అందుకే ఇప్పుడు ప్రజలు కేవలం హామీల ఆకర్షణనే కాదు, వాటి అమలు సాధ్యత, నిధుల సమీకరణ, రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుపై ప్రభావాన్ని కూడా అంచనా వేయాల్సిన అవసరం ఉంది.

**ఫిరోజ్ ఖాన్,**
**సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**(ఫోన్: 9640466464)**

# సంక్షోభాల సృష్టికర్తలు.. మన పాలకులు !

**సంపాదకీయం**

ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఓ సంక్షోభం వస్తూనే ఉంటుంది. ఇరాన్ సంక్షోభం ఇంకా ముగియలేదు. ట్రంప్ మరోమారు రంకెలు వేస్తున్నారు. బాంబులు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇదే జరిగితే మరింత ఆర్థిక సంక్షోభం తప్పేలా లేదు. ఈ సంక్షోభాలకు భయపడి సంసారం చేద్దామ లేక ఇల్లు చక్కబెట్టుకుందామా అన్నది పాలకులు ఆలోచన చేయాలి. ముఖ్యంగా ప్రధాని మోడీ ఆర్థిక చర్యలు దిద్దుబాటు లాగా లేవు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన వేళ కేవలం కాన్వాయ్‌లో కార్లు తగ్గించడంతో సరిపెట్టేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోంది. సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. వేలకోట్లు వడ్డీలు కట్టడానికే వెచ్చిస్తున్నాయి. ఇందులో తెలుగు రాష్ట□లు ముందున్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నారు. ఇంట్లోకి వెళ్లి వండిపెట్టడమే తరువాయి అన్నట్లుగా పథకాలను వండి వారుస్తున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నడపడానికి నిత్యం అప్పులు చేయడం, ఉన్న భూములను అమ్మేయడం అలవాటు చేసుకున్నారు. ఓట్ల కోసం నానాగడ్డి కరుస్తారనడానికి ఈ పథకాలే నిదర్శనం. ఇకపోతే పొదుపు విషయంలో ప్రజా ప్రతినిధులకు లెక్కేలేదు. గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు సాధారణ ప్రజల్లాగా విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. హెలికాప్టర్లకు కొదవే లేదు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసరంగా వెళ్లడానికి వేరు. కానీ ప్రతి కార్యక్రమం కోసం విమానాలు, హెలికాప్టర్లు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చంద్రబాబు అయితే స్వచ్ఛాంధ్ర, పెన్షన్ల పంపిణీకి చేస్తున్న ఆర్భాటం అంతాఇంతాకాదు. వీటికి వెళ్లకుండా కార్యక్రమాలను నడిపించేవచ్చు. కానీ ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడం కోసం నానా తంటాలు పడుతుంటారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటన్నది బాబు చెప్పాలి. అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారన్నది తెలియదు. అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని ఊరేగుతున్నారు. మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు. ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మ□డు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారని కేంద్రమే ప్రకటించింది. అయినా భద్రతను కుదించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు ఆదర్శమని చెప్పాల్సిందే. హంగూ ఆర్భాటంలో ఆయన ముందుంటారు. ఆయిల్ సంక్షోభంతో ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి మరింత జాగ్రత్తలు చేపట్టారు. మహానాడును సైతం వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అయితే తమ కార్యక్రమాల్లో పొదుపు పాటించి, దుబారా ఖర్చులు తగ్గించుకోగలిగితే మంచిదే. కానీ తెలుగు రాష్ట□ల ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు హంగూ ఆర్భాటం పెరిగింది. దుబారా అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నది కనిపించడం లేదు. మితివి□రిన ఖర్చులతో రాష్ట□లను అప్పుల ఊబిలోకి నెట్టేసారు. జగన్ ఉండగా అంతకు మించి అన్నట్లుగా డబ్బులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. విశాఖలో అత్యాధునిక గెస్ట్ హౌజ్‌లు కట్టుకున్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా మందీ మార్బలంతో పాటు, భారీ కాన్వాయ్‌లతో వెళుతుంటారు. ఇలా అప్పులు కావడానికి పాలకులు తీరు కారణం. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా సంక్షేమ పథకాలతో వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం, ఉచిత సిలిండర్, ఉచిత కరెంట్, ఉచితంగా చీరలువంటి సంక్షేమ పథకాల అవసరమా అని ఆలోచించడం లేదు. ఉత్పాదక సాధించి, ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించాల్సింది పోయి అనుత్పాదక వ్యయం వైపు దేశంతో పాటు ప్రజలను మళ్లించడం ఏ తరహా అభివృద్ధి అన్నది పాలకులు చెప్పాలి. ప్రభుత్వాలు లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎందుకో ప్రజలకు జవాబు ఇవ్వాలి. బడా పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగవేస్తున్నా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలి. ఇవన్నీ సవరించుకో నంతవరకు దేశంలో అప్పులవి□ద ఆధారపడాల్సిందే. పాలకుల తీరు మారాలి. ప్రజలతీరూ మారాలి. కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు అని గుర్తించాలి. అప్పలుఉ చేయడం, దేశాన్ని అధోగతి పాలు చేయకుండా పాలన చేయడం అలవాటు చేసుకుంటే మంచిది.

## ప్రేగువాపు వ్యాధులపై అవగాహన కలిగి ఉందాం !

**(19 మే "ప్రపంచ ప్రేగు వాపు (తాపజనక) వ్యాధుల దినం" సందర్భంగా)**

ప్రపంచవ్యాప్తంగా "ప్రేగు వాపు సంబంధ (తాపజనక) వ్యాధులు" లేదా "ఇన్‌ఫ్లమేటరీ బొవెల్ డిసీజెస్" క్రమంగా పెరగడం ఒక ప్రజారోగ్య హెచ్చరికగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యమైన ప్రేగు వాపు వ్యాధుల్లో "అల్సరెటివ్ కోలిటిస్", "క్రోన్స్ వ్యాధి" వస్తాయి. ఈ ప్రేగు సంబంధ వ్యాధుల బారిన పడడంతో కుటుంబాలు ఆర్థిక పతనం కావడమే కాకుండా దీర్ఘకాలిక చికిత్సల అవసరం అవుతాయి. పాశ్చాత్య దేశాల్లో ఆహారపు అలవాట్ల కారణంగా అధికంగా నమోదు అవుతున్న ప్రేగు వాపు వ్యాధులు నేడు ఆసియా దేశాలకు కూడా క్రమంగా విస్తరించడం గమనిస్తున్నాం. వయో పరిమితులు లేని ఈ వ్యాధులను నిర్లక్ష్యం చేసినా, రోగ నిర్ధారణ ఆలస్యం అయినా ప్రమాదకరంగా మారుతుంది.

**ప్రపంచ ప్రేగు వాపు వ్యాధుల దినం-2026 ఇతివృత్తం:**

ప్రేగు వాపు సంబంధ వ్యాధుల పట్ల సంపూర్ణ అవగాహన కలిపించడానికి ప్రతి ఏట 19 మే రోజున "ప్రపంచ ప్రేగు వాపు వ్యాధుల దినం" లేదా "వరల్డ్ ఇన్‌ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ ప్రేగు వాపు వ్యాధుల దినం ఇతివృత్తంగా "సరిహద్దులు లేని ప్రేగు వాపు వ్యాధులు : అందరికీ ఆరోగ్య సురక్ష" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రారంభంలోన రోగ నిర్ధారణ చేసుకోవడం ఒక ఉత్తమమైన మార్గంగా నిలుస్తుంది. అన్ని అపోహలను అధిగమించి పది మందిలో ప్రేగు వాపు వ్యాధుల పట్ల చర్చించుకోవడం వల్ల అవగాహన పెరుగుతుంది.

**ప్రేగు వాపు వ్యాధులకు కారణాలు, రోగ లక్షణాలు, నివారణ మార్గాలు:**

సాధారణంగా మనం తీసుకునే ఆహారమా మన ఆరోగ్యానికి లేదా అనారోగ్యానికి కారణంగా నిలుస్తుంది. కొవ్వులు, చక్కెరలు, రిఫైన్డ్ పిండి పదార్థాలు, తీపి శీతలపానీయాలు, జంతు సంబంధ ఆహారాలు, ఆల్కహాల్ సేవనం, నిల్వ ఉంచడానికి లేదా రంగులు రావడానికి ఆహార పదార్థాల్లో కలిపే రసాయాలు అతిగా వాడడం, అధిక కారం ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల ప్రేగు వాపు వ్యాధులు పెరుగుతాయి. తాజా పండ్లు, మొలకలు, కూరగాయలు, పీచు పదార్థాలు, అధికంగా నీరు తాగడం, కలిగిన ఆహార పదార్థాలు ఆరోగ్య ప్రదాయినిలుగా నిలుస్తాయి. ప్రేగు వాపు వ్యాధుల లక్షణాల్లో ప్రేగుల్లో అల్సర్లు లేదా పుండ్లు ఏర్పడడం, మలంలో రక్తం పడడం, బరువు తగ్గడం, కడుపు నొప్పి, దీర్ఘకాలం పాటు విరోచనాలు కావడం, అలసట, ప్రేగు గోడల కణజాలం వాపు కనిపించడంతో లాంటివి కనిపిస్తాయి.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. మన జీవనశైలి మన రోగ నిరోధకతను ప్రభావితం చేస్తుంది. రోగ చికిత్స కన్న రోగ నివారణే మిన్న అనే నినాదం మన నిత్య మంత్రం కావాలి. ప్రేగు పడవాపు వ్యాధుల కట్టడికి ఆహార నియమాలను పాటిస్తూ, దురలవాట్లకు దూరంగా ఉంటూ సుఖ జీవనయానం చేయాలి. ఆరోగ్యకర పౌర సమాజ స్థాపనకు మన వంతు బాధ్యతలను నిర్వహించాలి.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

## జలాంతర్గామి శక్తికి మూలస్తంభం ఐ.ఎన్.ఎస్. వీరబాహు



మే 19...ఐ.ఎన్.ఎస్. వీరబాహు అధికారికంగా ప్రారంభం అయిన దినం

1971 మే 19న భారతీయ నౌకాదళ చరిత్రలో ఒక కీలక ఘట్టం ఆవిర్భవించింది. ఆ రోజున విశాఖపట్నం తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో "ఐ.ఎన్.ఎస్. వీరబాహు" అనే ప్రత్యేకమైన జలాంత ర్గాముల స్థావరం అధికారికంగా ప్రారంభ మైంది. ఇది భారతదేశ జలాంతర్గామి దళానికి ఒక శక్తివంతమైన కేంద్రంగా మారింది. సబ్‌మెరిన్ శక్తిని పెంచేందుకు దేశం చేసిన మొదటి ఘట్ట ప్రయత్నాల్లో ఇది ప్రముఖంగా నిలిచింది. ఈ సంఘటన పూర్వా పరాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

1960ల చివరి నాటికి సముద్ర రక్షణలో వ్యూహాత్మక పరంగా జలాంతర్గాముల ప్రాముఖ్యత పెరుగు తోందని భారత నౌకాదళం గుర్తించింది. సముద్రపు లోతుల్లో శత్రువుల కదలికలను గుర్తించి, వారిపై అకస్మాత్తుగా దాడి చేయగల సామర్థ్యం జలాంతర్గాముల ప్రత్యేకత. దీంతో 1967లో రష్యా నుండి తొలిసారి ఐ.ఎన్.ఎస్. కల్వరి అనే జలాంతర్గామిని భారత నౌకాదళం పొందింది. ఈ సంఘటన దేశానికి సముద్ర లోతుల్లో కూడా రక్షణ కవచాన్ని అందించే దిశగా వేసిన మొదటి అడుగు. తరువాత మరిన్ని జలాంతర్గాములు భారత నౌకాదళంలో చేరినప్పుడు, వాటి నిర్వహణ, మరమ్మతులు, సిబ్బంది శిక్షణకు ప్రత్యేక స్థావరం అవసరమైంది.

ఈ నేపథ్యంలో విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కేంద్రంలో "ఐ.ఎన్.ఎస్. వీరబాహు" స్థాపించ బడింది. వీరబాహు అంటే ధైర్యవంతుని భుజం. భారత పురాణాలలో శివుని కుమారుడు కార్తికేయుడికి వీరబాహు అనుచరుడిగా ప్రముఖమైన పాత్ర ఉంది. అతడి ధైర్యాన్ని, నిస్సహాయులను కాపాడే శక్తిని సూచించేలా ఈ స్థావరానికి ఆ పేరును ఇచ్చారు. ఇది నౌకాదళ ధైర్యం, సామర్థ్యానికి ఒక ప్రతీకగా నిలుస్తోంది.

ప్రారంభ దశలో ఈ స్థావరం 8వ జలాంతర్గామి స్క్వాడ్రన్‌కు మద్దతు కేంద్రంగా పనిచేసింది. జలాంతర్గాములకి అవసరమైన మరమ్మతులు, లాజిస్టిక్ మద్దతు, సిబ్బందికి వసతి, శిక్షణ తదితర సౌకర్యాలన్నింటినీ ఇది సమకూర్చింది. ఆ కాలంలో ఈ స్థావరం కమాండింగ్ ఆఫీసర్‌కి 8వ స్క్వాడ్రన్ కమాండ్ బాధ్యతలు కూడా ఉండేవి. కాలక్రమేణా, జలాంతర్గాముల సంఖ్య పెరిగిన వెంటనే స్థావరం నిర్వహణ అధికారం "కెప్టెన్ సబ్‌మెరైన్స్" నుండి "కమోడోర్ సబ్‌మెరైన్స్"కి, ఆ తర్వాత 1997లో "కమోడోర్ కమాండింగ్ సబ్‌మెరైన్స్ (ఈస్ట్)"గా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం తూర్పు నౌకాదళంలోని అన్ని జలాంతర్గాముల కార్యకలాపాలు ఈ స్థావరంలోనే సంచాలితమవుతున్నాయి.

### 1971లో స్థాపితమైన ఐ.ఎన్.ఎస్

వీరబాహు అదే ఏడాది జరిగిన భారత్–పాకిస్తాన్ యుద్ధంలో కీలకమైన మద్దతు కేంద్రంగా పనిచేసింది. ఐ.ఎన్.ఎస్. కురుసురా వంటి జలాంతర్గాములు వీరబాహు ఆధ్వర్యంలో యుద్ధంలో పాల్గొని దేశ రక్షణలో విశేష కృషి చేశాయి. నేడు భారత నౌకాదళం అణు సబ్‌మెరిన్‌ల వంటి అత్యాధునిక నౌకాశక్తిని కలిగి ఉండడంలో వీరబాహు లాంటి స్థావరాలే బలమైన పునాది అయ్యాయి.

ఈ స్థావరం కేవలం జలాంతర్గాములకు మద్దతు ఇవ్వడమే కాదు, శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణ, లాజిస్టిక్స్ వంటి అనేక విభాగాల్లో నిపుణులని తయారుచేసే కేంద్రంగా మారింది. ఇది తూర్పు తీరానికి ఒక రహస్య రక్షణ గోడగా నిలుస్తోంది. జలాంతర్గామి విభాగంలో పని చేసే ప్రతి నావికుడికి ఇది ఒక గౌరవప్రదమైన గుర్తింపు స్థావరంగా ఉంది.

ఐ.ఎన్.ఎస్ వీరబాహు స్థాపనతో భారతీయ నౌకాదళం సబ్‌మెరిన్ శక్తిలో నూతన శకాన్ని ప్రారంభించింది. ఇది సముద్ర తీరాలపై కాకుండా, సముద్రపు లోతుల్లోనూ భారత స్వతంత్రతను పరిరక్షించే సంకేతంగా నిలిచింది. జలాంతర్గామి శక్తి వికాసానికి, శిక్షణా నైపుణ్యాల అభివృద్ధికి ఇది ఒక ఆధార బలమైన కేంద్రంగా కొనసాగుతోంది. దేశ రక్షణ వ్యూహాలలో కీలకమైన ఈ స్థావరం భవిష్యత్తులో మరింత శక్తిమంతమైన సబ్‌మెరిన్ శకటానికి దారి చూపిస్తోంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**



## వేసవికాలంలో మజ్జిగను తాగితే
# ఎన్నో ప్రయోజనాలు

**వేసవికాలంలో చాలా మంది ఇళ్లలో మజ్జిగకు ప్రత్యేక స్థానం ఉంటుంది. శరీరానికి చల్లదనం ఇవ్వడమే కాకుండా జీర్ణక్రియకు మేలు చేస్తుందని వైద్యులు చెప్పే ఈ సంప్రదాయ పానీయం ఇప్పుడు ఆరోగ్యపరంగానూ మరింత ప్రాధాన్యం పొందుతోంది. రోజూ రెండు వారాల పాటు మజ్జిగ తాగితే శరీరంలో కొన్ని సానుకూల మార్పులు కనిపించే అవకాశం ఉందని తాజా పరిశీలనలు సూచిస్తున్నాయి.**

మజ్జిగలో ఉండే ఫెర్మెంటెడ్ యోగర్ట్ బ్యాక్టీరియా జీర్ణాశయ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి పొట్టలో మంచి బ్యాక్టీరియా సంఖ్యను పెంచి ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా సహాయపడతాయి. రెండు వారాల పాటు మజ్జిగ తాగే అలవాటు వల్ల పొట్ట తేలికగా అనిపించడం, గ్యాస్ లేదా బ్లోటింగ్ సమస్యలు తగ్గడం వంటి మార్పులు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**జీర్ణ వ్యవస్థకు, వేసవి తాపం తగ్గేందుకు..**

మజ్జిగలో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో శరీరానికి తగిన హైడ్రేషన్ అందుతుంది. ఇందులో సహజంగా ఉండే పొటాషియం, సోడియం వంటి ఎలక్ట్రోలైట్స్ శరీర ద్రవ సమతుల్యాన్ని కాపాడటంలో సహాయపడతాయి. ముఖ్యంగా వేడి వాతావరణంలో అలసట తగ్గి శరీరం తాజాగా అనిపించడానికి ఇది ఎంతో దోహదపడుతుంది. అలాగే ఫెర్మెంటెడ్ డైరీ ఉత్పత్తులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గట్ మైక్రోబయోమ్ (మంచి బ్యాక్టీరియా) మెరుగుపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. దీని వల్ల మలబద్ధకం తగ్గడం, జీర్ణక్రియ సక్రమంగా సాగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయి. అయితే ఈ మార్పులు ఒక్కసారిగా కాకుండా క్రమంగా కనిపిస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అదే విధంగా మజ్జిగకు సహజమైన చల్లదన లక్షణం ఉండటం వల్ల శరీరంలోని అంతర్గత వేడిని తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. భోజనం తర్వాత కడుపులో మంట, అసౌకర్యం తగ్గి శరీరం ప్రశాంతంగా అనిపించే అవకాశం ఉంటుంది. వేసవిలో ఇది మరింత ఉపశమనాన్ని ఇస్తుంది.

**బరువు తగ్గేందుకు అవకాశం..**

అలాగే భోజనం తర్వాత లేదా మధ్యలో మజ్జిగ తాగడం వల్ల ఎక్కువసేపు తృప్తిగా అనిపిస్తుంది. తక్కువ కేలరీలతో ఉండే ఈ పానీయం అనవసరంగా ఎక్కువ తినే అలవాటును తగ్గించడంలో సహాయపడుతుంది. దీంతో స్నాక్స్ తినాలనే కోరిక కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ప్రతి ఒక్కరి శరీరం ఒకేలా స్పందించదు. పాలలో ఉండే లాక్టోస్‌కు సున్నితంగా స్పందించే కొందరికి మజ్జిగ కూడా కొంత అసౌకర్యం కలిగిస్తుంది. అయితే ఫెర్మెంటేషన్ ప్రక్రియలో లాక్టోస్ కొంతవరకు తగ్గిపోవడం వల్ల సాధారణ పాలతో పోలిస్తే మజ్జిగను చాలా మంది సులభంగా జీర్ణం చేసుకోగలరని నిపుణులు చెబుతున్నారు. రోజూ మజ్జిగ తాగే అలవాటు ఒక్కసారిగా పెద్ద మార్పులు తీసుకురాకపోయినా, శరీరం తేలికగా ఉండటం, జీర్ణక్రియ మెరుగుపడటం, హైడ్రేషన్ పెరగడం వంటి ఉపయోగకరమైన మార్పులను అందిస్తుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

## చర్మం ఆరోగ్యంగా, అందంగా
# కనిపించాలంటే...

**చర్మం అందంగా, కాంతివంతంగా ఉండాలంటే ఖరీదైన క్రీములు లేదా సుదీర్ఘమైన స్కిన్‌కేర్ రొటీన్లు అవసరమని చాలా మంది భావిస్తారు. అయితే నిపుణులు చెబుతున్నది మాత్రం వేరే విషయం. మనం ప్రతిరోజూ తీసుకునే ఆహారమే చర్మ ఆరోగ్యంపై అధిక ప్రభావం చూపుతుందని వారు తెలియజేస్తున్నారు. మొటిమలు, మసకబారిన చర్మం, డార్క్ సర్కిల్స్, పొడిబారిన చర్మం వంటి సమస్యలు చాలా సందర్భాల్లో శరీరంలో పోషక లోపాలను సూచిస్తాయని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు. రోజువారీ ఆహారంలో కొన్ని సాధారణ పదార్థాలను చేర్చడం ద్వారా సహజంగా చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని వారు వివరిస్తున్నారు. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఎలాంటి ఆహారాలను తీసుకోవాలో వారు తెలియజేస్తున్నారు.**





**పచ్చి ఉసిరికాయ, స్పియర్‌మింట్ టీ..**

మసకబారిన చర్మానికి పచ్చి ఉసిరికాయ మంచి ఔషధంగా పని చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఉదయం ఒక పచ్చి ఉసిరికాయ తినడం వల్ల శరీరానికి విటమిన్ సి సమృద్ధిగా లభిస్తుంది. ఇది చర్మానికి సహజ కాంతిని తీసుకురావడంలో సహాయపడుతుంది. అలసటగా, నిస్సత్తువగా కనిపించే చర్మానికి ఇది మంచి ఎంపిక అని చెప్పవచ్చు. మొటిమలు, బ్రేకౌట్స్‌తో బాధపడే వారు స్పియర్‌మింట్ టీ తీసుకోవడం మంచిది. ప్రతిరోజూ ఒక కప్పు స్పియర్‌మింట్ టీ తాగడం హార్మోన్ల సమతౌల్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దీని వల్ల కాలక్రమేణా మొటిమలు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే డార్క్ సర్కిల్స్ తో బాధపడే వారు నానబెట్టిన బాదం పప్పును తీసుకోవడం మంచిది. ఉదయం 5 నానబెట్టిన బాదం గింజలు తింటే విటమిన్ ఇ, ఆరోగ్యకరమైన కొవ్వులు లభిస్తాయి. ఇవి చర్మ కణాల పునరుద్ధరణకు సహాయపడుతూ కళ్ల కింద నలుపు తగ్గించడంలో ఉపయోగపడతాయి.

**నెయ్యి, ఆక్రోట్లు..**

పొడిబారిన చర్మంతో బాధపడే వారు నెయ్యిని తీసుకోవాలి. రోజువారీ ఆహారంలో ఒక టేబుల్ స్పూన్ నెయ్యి చేర్చడం వల్ల చర్మానికి లోపల నుంచే తేమ అందుతుంది. ఇది పొడిబారిన, పొట్టు ఊడే చర్మానికి ఉపయోగకరంగా ఉంటుంది. మచ్చలు, పిగ్మెంటేషన్‌కు పసుపు నీరు ఔషధంగా పని చేస్తుంది. గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ పసుపు కలిపి తీసుకోవడం శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గించడంలో సహాయపడుతుంది. దీని వల్ల చర్మంపై మచ్చలు, పిగ్మెంటేషన్ తగ్గే అవకాశం ఉంటుంది. ముందస్తు వృద్ధాప్య లక్షణాలు ఉన్న వారు నానబెట్టిన ఆక్రోట్లను తీసుకోవడం మంచిది. రోజుకు నాలుగు నానబెట్టిన ఆక్రోట్లను తీసుకోవడం ద్వారా ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు లభిస్తాయి. ఇవి చర్మం సడలిపోకుండా, ఎలాస్టిసిటీ మెరుగుపడేందుకు సహాయపడతాయి.


**బొప్పాయి, గుమ్మడి గింజలు..**

అసమాన చర్మ వర్ణానికి బొప్పాయి చక్కగా పని చేస్తుంది. ఉదయం అల్పాహారంలో ఒక బౌల్ బొప్పాయి తీసుకుంటే అందులోని ఎంజైమ్స్, యాంటీ ఆక్సిడెంట్లు చర్మ వర్ణాన్ని సమతౌల్యంలో ఉంచడంలో సహాయపడతాయి. ఆయిలీ స్కిన్, ఓపెన్ పోర్స్ ఉన్న వారు గుమ్మడికాయ గింజలను తీసుకోవాలి. రోజుకు ఒక టేబుల్ స్పూన్ గుమ్మడికాయ గింజలను తీసుకోవడం ద్వారా చర్మంలోని ఆయిల్ బ్యాలెన్స్ ను మెరుగుపడవచ్చు. ఇది ఓపెన్ పోర్స్ సమస్యను తగ్గించడంలో కూడా ఉపయోగపడుతుంది. అందమైన చర్మం కోసం ఎక్కువ ఖర్చు చేసే స్కిన్‌కేర్ కంటే సరైన ఆహారం తీసుకోవడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ చిన్న చిన్న ఆహార మార్పులు చేయడం ద్వారా చర్మ ఆరోగ్యాన్ని సహజంగా మెరుగుపరచుకోవచ్చు. క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవడం వల్ల చర్మం కాంతివంతంగా, ఆరోగ్యంగా కనిపించడమే కాకుండా మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు.






# భారీ నష్టాల్లో మార్కెట్లు
## ముడిచమురు భయాలు..
## భారీగా పతనమైన సూచీలు



**దేశీయ మార్కెట్లు సోమవారం భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల చుట్టూ ఉన్న అనిశ్చితులు, ముడి చమురు ఆందోళనలు మన స్టాక్ మార్కెట్‌ను వదలడం లేదు. దాంతో నేటి ట్రేడింగ్‌లో సూచీలు నష్టాల్లో కదలాడుతున్నాయి. సెన్సెక్స్ ఒక దశలో 1000 పాయింట్లకు పైగా పడిపోయింది.**

ఉదయం 9.29 గంటల సమయంలో సెన్సెక్స్ 825 పాయింట్లు క్షీణించి, 74,387 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 265 పాయింట్లు పతనమై 23,378 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, విప్రో, భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్ షేర్లు లాభాల్లో ఉండగా.. పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టాటా స్టీల్, మారుతీ సుజుకీ, శ్రీరామ్ ఫైనాన్స్, ఐషర్ మోటార్స్ స్టాక్స్ నష్టాల్లో ఉన్నాయి.

**రూపాయి రికార్డు పతనం..**

అమెరికా డాలర్‌తో పోలిస్తే మన రూపాయి రికార్డు స్థాయిలో బలహీనపడింది. ప్రస్తుతం మారకం విలువ 96.20గా ఉంది. ముడిచమురు ధరల భారం, పెరిగిన వాణిజ్యలోటు, విదేశీ మదుపర్ల అమ్మకాలు, ద్రవ్యోల్బణం మన కరెన్సీ ప్రభావం చూపిస్తున్నాయి. హర్మూజ్ అంశంలో వెంటనే ఒప్పందానికి రాకపోతే.. ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యోచిస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. ఈ వార్తలతో ఫ్యూచర్స్‌లో బ్రెంట్ క్రూడ్ ధర ఒక బ్యారెల్‌కు 111 డాలర్లకు పెరిగింది. హర్మూజ్ అంతరాయాల వేళ.. రష్యా చమురు దిగుమతులపై అమెరికా ఇచ్చిన ఆంక్షల మినహాయింపు ఈ రోజుతో ముగియనుంది. రష్యా చమురుపై దిగుమతులపై ఆధారపడిన భారత్‌కు ఇది తీవ్రంగా ఇబ్బందిపెట్టే అంశం. ఇప్పటికే దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. ఈ మినహాయింపుల గడువు పూర్తి కావడంతో ఆ ధరలు మరింత పెరగొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల కారణంగా మన సూచీలు నేటి సెషన్‌లో నష్టాల్లో ఉన్నాయి. చమురు ధరలు పెరుగుతుండటంతో ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. దాంతో శుక్రవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. ఆసియా మార్కెట్లలోనూ అదే పరిస్థితి నెలకొంది.

# ఖర్చులను భారీగా తగ్గించుకోవాలి
## ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు..!



ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థలకు కేంద్రం కీలక ఆదేశాలు జారీచేసింది. ఖర్చులను భారీగా తగ్గించుకోవాలని సోమవారం తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు చర్యల్లో భాగంగా ప్రయాణాలపై తీవ్ర ఆంక్షలు విధించడంతో పాటు దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని స్పష్టంచేసింది. ఈ కొత్త నిబంధనలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటి దిగ్గజ సంస్థలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులకు వర్తించనున్నాయి. కేంద్ర ఆర్థిక సేవల విభాగం తాజా ఉత్తర్వులు జారీచేసింది. అత్యవసరమైతే తప్ప అన్ని రకాల సమావేశాలు, సమీక్షలు, సంప్రదింపులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే నిర్వహించాలని కేంద్రం సూచించింది. సంస్థల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల (సీఈఓ) విదేశీ ప్రయాణాల్లో పరిమితి పాటించాలని తెలిపింది. సాధ్యమైనంత వరకు విదేశీ సమావేశాలకు వర్చువల్‌గానే హాజరుకావాలని పేర్కొన్నది. వీటితోపాటు ప్రధాన కార్యాలయాలు, బ్రాంచ్ ఆఫీసుల్లో ప్రస్తుతం అద్దెకు వాడుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో వీలైనంత వరకు ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టాలని ఆదేశించింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతలవల్ల ఏర్పడే ఆర్థిక ప్రభావాలను తట్టుకునేందుకు ఖర్చులను తగ్గించుకోవాలని, పొదుపు పాటించాలని ప్రధానమంత్రి మోదీ గతవారం పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో సుదీర్ఘకాలంగా సాగుతున్న ఉద్రిక్తతలవల్ల దేశ ఆర్థికవృద్ధి మందగించడం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే భారత కరెన్సీ రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఇప్పటికే పలు రాష్ట్రాలు తమ ఉద్యోగులకు వారానికి రెండు రోజులు 'వర్క్ ఫ్రమ్ హోమ్' సౌకర్యాన్ని కూడా కల్పించాయి.

## కనిష్ఠానికి పడిపోయిన
# రూపాయి విలువ..

**రూపాయి విలువ సోమవారం జీవనకాల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికా డాలర్ తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.2 శాతం క్షీణించి 96.20 వద్ద ఆల్ టైమ్ లోయర్ స్థాయికి చేరింది. పశ్చిమాసియా లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీయడం రూపాయి విలువపై ప్రభావం చూపింది. దాంతో భారీ పతనం నమోదైంది. అమెరికన్ డాలర్‌తో పోల్చితే గత శుక్రవారం తొలిసారిగా రూ.96 మార్కును దాటిన రూపాయి, సోమవారం మరింత బలహీనపడింది.**



ముఖ్యంగా ముడి చమురు ధరలు పెరగడం రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. యూఏఈలోని ఓ అణు విద్యుత్ కేంద్రంపై దాడి జరిగిందన్న వార్తల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 111 డాలర్లకు పెరిగింది. దీనికి తోడు ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యలకు దిగవచ్చన్న సంకేతాలు కూడా ఆందోళనలను పెంచుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో డాలర్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. రూపాయి రికార్డు స్థాయి పతనం దేశ స్థూల ఆర్థిక దృక్పథంపై ఆందోళనలను తీవ్రతరం చేస్తోంది. ఈ బలహీన సెంటిమెంట్ స్టాక్ మార్కెట్లపైనా ప్రభావం చూపింది. సోమవారం సెన్సెక్స్ 808 పాయింట్లు, నిఫ్టీ 247 పాయింట్ల నష్టంతో ప్రారంభమయ్యాయి. మరోవైపు, రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం, ఆర్బీఐ చర్యలు చేపట్టాయి. వెండి దిగుమతులపై ఆంక్షలు విధించడంతో పాటు, కరెన్సీ మార్కెట్లలో ఆర్బీఐ జోక్యం చేసుకుంటోంది. ఈ వారమంతా రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు.

## చాట్‌జీపీటీని తెగ వాడేస్తున్నారు
### నెలలోనే 100 కోట్ల ఇమేజ్‌లు!

ఓపెన్‌ఏఐకి చెందిన ఇమేజ్ జనరేషన్ టూల్ చాట్‌జీపీటీ ఇమేజెస్ 2.0ను భారతీయులు తెగ వాడేస్తున్నారు. ఈ సరికొత్త ఇమేజ్ జనరేషన్ టూల్ సాయంతో ఇప్పటివరకు 100 కోట్లకు పైగా చిత్రాలను సృష్టించారని ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. గత కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో ఏఐ ద్వారా క్రియేట్ చేసిన చిత్రాల హవా నడుస్తోంది. యానిమేటెడ్ స్టైల్ పోర్ట్రెయిట్‌లు, లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ఫోటోలు, ఫాంటసీ ఎడిట్స్, స్టైలిష్ అవతార్‌లను క్రియేట్ చేయడానికి ఏఐ టూల్స్‌ను వినియోగిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. అలా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఓపెన్‌ఏఐ విడుదల చేసిన చాట్‌జీపీటీ ఇమేజెస్ 2.0 భారతీయుల మెప్పు పొందింది. పాత వెర్షన్‌తో పోలిస్తే మరింత స్పష్టమైన ఎడిటింగ్, రిచ్ లేఅవుట్స్, వివిధ భాషల్లో వాడే వీలుండడం, టెక్స్ట్‌ను చక్కగా రాయగల సామర్థ్యాన్ని కలిగి ఉండడంతో చాట్‌జీపీటీ ఇమేజెస్ 2.0 యూజర్లను ఆకట్టుకుంటోంది. దీంతో ఈ టూల్‌ను భారీ స్థాయిలో ఉపయోగిస్తున్నారు.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను దాటేసిన ఎయిర్‌టెల్

టెలికాం సర్వీస్ ప్రొవైడర్ భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువపరంగా రెండో అతిపెద్ద కంపెనీగా అవతరించింది. ప్రైవేటురంగానికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానానికి చేరుకుంది. సోమవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో భారతీ ఎయిర్‌టెల్ షేర్లు రాణించడంతో ఇంట్రాడేలో మార్కెట్ విలువ రూ.11.90 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.11.80 లక్షల కోట్లుగా ఉంది. రూ.18.11 లక్షల కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నాలుగు రోజులుగా రాణిస్తున్నాయి. సోమవారం కూడా మరో 3 శాతం రాణించడంతో ఈ ఫీట్ సాధ్యమైంది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూ.1,904.60 వద్ద ముగిసిన ఎయిర్‌టెల్ షేరు విలువ.. నేడు 1,953.80 వద్ద గరిష్ఠాన్ని తాకింది. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో 11 శాతం మేర లాభపడింది. ఏప్రిల్‌లో 6 శాతం, మే నెలలో 3 శాతం చొప్పున ఎయిర్‌టెల్ షేరు విలువ పెరిగింది.

## పర్యాటక కేంద్రంగా ముత్తంగి ఎంక చెరువు

ఏడు కోట్ల 60 లక్షల రూపాయలతో చెరువు సుందరీకరణ..

పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్..

అతి త్వరలో ప్రారంభోత్సవం





**పటాన్చెరు, మే18 (నినాదం) :** ముత్తంగి డివిజన్ పరిధిలోని ఎంక చెరువును 7 కోట్ల 60 లక్షల రూపాయలతో సుందరీకరణ చేస్తున్నామని.. అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం హెచ్ఎండిఏ అధికారులు, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. స్వయంగా చెరువు కట్టపై ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో గల ఎంక చెరువును పర్యటకంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంతో హెచ్ఎండిఏ ద్వారా 7 కోట్ల 60 లక్షల రూపాయలు నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా కట్ట అభివృద్ధితోపాటు బతుకమ్మ ఘాట్, లైటింగ్, వాకింగ్ ట్రాక్, హైమాస్ట్ లైటింగ్, గార్డెనింగ్, తదితర పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని.. మరో రెండు నెలల్ల పనులు పూర్తిచేసి.. ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని హామీ ఇచ్చారు. ఇస్నాపూర్ ప్రజలు సైతం చెరువు కట్ట పైకి సులభంగా చేరుకునేందుకు కనెక్టింగ్ బ్రిడ్జి నిర్మించనున్నట్లు తెలిపారు. ముత్తంగితోపాటు ఇస్నాపూర్, పాశమైలారం, చిట్కుల్, లకడారం గ్రామాల ప్రజలకు ఆహ్లాదకరమైన చెరువు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పటాన్చెరులోని సాకి చెరువు, తిమ్మక్క చెరువు, దోషం చెరువులను సైతం పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ డిఈ రామారావు, మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, కుమార్ గౌడ్, ప్రభాకర్, కిట్టు, శ్రీనివాస్ రెడ్డి, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, అబేద్, రవి, పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం : సీఐ వెంకటేశ్వర్లు



**ఆమనగల్లు, మే 18(నినాదం):** క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు అన్నా రు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు విఠయిపల్లిలో వీ.పీ.ఎల్ క్రికెట్ టోర్నమెంట్ కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముగింపు కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. ఆటల్లో గెలుపోటములు పట్టుంచుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఒకటో వార్డు సభ్యురాలు ధోనిమల్యా, నాయకులు శ్రీనివాస్ రెడ్డి పర్వతాలు, శ్రీధర్ నాయక్, దావీదు, ఎస్ రవీందర్, సురేష్, బలరాం, రవి, తిరుమలయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, సాయి, చంద్ర హర్యా, సత్య, శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

జోనల్ కమిషనర్ కే.సత్యనారాయణ




**చార్మినార్, మే18(నినాదం):** స్థానిక ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ ) చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కే.సత్యనారాయణ సూచించారు. ఆయన పర్యవేక్షణ లో చాంద్రాయణగుట్ట నర్కి పూల్‌బాగ్ లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ సర్కిల్ కి చెందిన ఇంజనీరింగ్ సమస్యల పై ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జోన్ పరిధిలోని ప్రజలు బస్తీలు, కాలనిలో నెలకొన్న పారిశుధ్యం, డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్లు, టౌన్ ప్లానింగ్ తదితర సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారులతో వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ దేవజా, ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ ఏసిపీ శ్రీధర్ రెడ్డి, వెటర్నరీ విభాగం సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ హమీద్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మీ సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన




**మల్కాజిగిరి, మే18 (నినాదం) :** ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఆధ్వర్యంలో చేపట్టిన 'మీ సురక్ష' కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు నేరేడ్ మెట్ పోలీసులు అన్నారు. ఇటీవల చోటుచేసుకుంటున్న వివిధ ఘటనల నేపథ్యంలో ఇంటి పనివాళ్ళు, డ్రైవర్లు, కేర్‌టేకర్లు, వాచ్‌మెన్‌లు, సెక్యూరిటీ గార్డులు, వంటవాళ్లు, కిరాయిదారులు తదితరుల పూర్తి వివరాలను 'మీ సురక్ష' గూగుల్ ఫారం లేదా క్యూఆర్ కోడ్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి వ్యక్తి వివరాలు ఒక క్రమబద్ధమైన వ్యవస్థలోకి వస్తాయని, ఇప్పటికే కాలనీలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులకు క్యూఆర్ కోడ్‌లు, గూగుల్ ఫారం లింక్‌లు అందజేసినట్లు తెలిపారు. ఇంకా నమోదు చేసుకోని వారు వెంటనే ఎన్రోల్ చేసుకోవాలని కోరారు. ఇందుకోసం పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక రిసెప్షన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ బృందాలు కాలనీల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయని వెల్లడించారు.

## తలాటి రమేష్ నేతకు శుభాకాంక్షలు దేప భాస్కర్ రెడ్డి



**ఎల్ బినగర్, నినాదం:** ఆర్ కెపురంలోని శ్రీ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్ నేత వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి పాల్గొని రమేష్ నేతను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్, ముప్పిడి లింగస్వామి గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, శ్రీమన్నారాయణ,శ్రీనివాస్, విజయలక్ష్మి, సుదర్శన్, రమేష్ గౌడ్, శ్యామ్ సుందర్, సాయి, మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆశవర్కర్ల వేతనాలు పెంచండి



**కొడంగల్, మే,18(నినాదం) :** ఆశవర్కర్ల కు వేతనాలు పెంచాలని,గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆశవర్కర్ల హామీలను అమలు చేయాలని సోమవారం కొడంగల్ కడ కార్యాలయంలో ఆశవర్కర్ల యూనియన్ మహిళలు వినతిపత్రం అందజేశారు. ప్రతినెల 1వ తేదీ న వేతనాలు బ్యాంకు ఖాతాలో జమచేయాలని, కనీస వేతనం 18వేల రూపాయల కు పెంచాలని, ఈఎస్ ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ సదుపాయాలు కల్పించాలని, లేఖలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, ఆశవర్కర్ల సంఘం నాయకులు లక్ష్మీ, అశోక రాణి, యాదమ్మ, సుజాత, అమృతమ్మ, పార్వతమ్మ, సత్యమ్మ, వినోద, పుష్ప, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఏసిఎఫ్ తెలుగు రాష్ట్రాల కన్వీనర్‌గా ఇనుప సురేష్



**జవహర్ నగర్, మే 18 (నినాదం):** అరుణోదయ సాం స్కృతిక సమాఖ్య ( అసాస) తెలుగు రాష్ట్రాల కన్వీనర్ గా ఇనుప సురేష్ కొనసాగుతారని ఇఫ్టు జాతీయ కార్యదర్శి షేక్షావలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఉద్యమాలకు దోపిడి వర్గాల గుండెల్లో బలమైన ఆయుధాలుగా తమ గొంతుకలను వినిపించాలని కోరారు . ఉద్యమాలలో దోపిడీ వర్గాల గుండెల్లో బలమైన ఆయుధాలుగా తమ గొంతుకలను వినిపించాలని కోరారు. భూస్వామ్య సామ్రాజ్యవాదం ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్న దళారి దోపిడీని ఎండగట్టాలని పేర్కొన్నారు. పార్టీకి అనుబంధంగా ఉన్న అసాస ప్రతిఘటన ఉద్యమంలో భాగస్వామ్యం చేయడానికి శ్రమించాలని సూచించారు.

## బయోమాస్ పెల్లెట్స్ వుడ్ గ్యాసిఫయర్ స్టవ్‌లను పంపిణి చేసిన ఎంపీ



**వికారాబాద్, మే 18(నినాదం):** బయోమాస్ పెల్లెట్స్ వుడ్ గ్యాసిఫియర్ స్టవ్ లను సోమవారం జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం లింగంపల్లిలో చేవెళ్ళ ఎం పీ విశ్వే శ్వర్ రెడ్డి పంపిణి చేశారు. ఈ సందర్భంగా వాటి వినియోగాన్ని, ఉపయోగాన్ని వివరించి పరమాన్నం వండి చూపించారు. ఈ నేపథ్యంలో అవసరాన్ని వివరించి జేకేఎం ఆర్ ఫౌండేషన్ తయారు చేసిన వుడ్ గ్యాసిఫయర్ దానికి అవసరమైన పెల్లెట్స్ కూడా స్థానికంగానే పరిశ్రమలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయితే పెల్లెట్స్ ను ఏ గ్రామం వారు ఆ గ్రామంలోనే వ్యవసాయ వ్యర్థాలతో తయారు చేసుకొని వాడాలనేది మా లక్ష్యం. ప్రపంచంలో యుద్ధాలు జరుగుతున్న క్రమంలో మన దేశానికి గనుక ఎల్ పీ జీ కొరత వస్తే మనం అవస్థ పడకుండా సిద్ధంగా ఉండాలని ఈ సందర్భం గా ఎంపీ సూచించారు. బయో మాస్ పెల్లెట్స్ ఎల్ పీ జీ కంటే తక్కువ ఖర్చు అవుతుందని అన్నారు. మన దేశంలో వేల కోట్ల రూపాయల ఎల్ పీ జీ , పెట్రోల్, వంట నూనెలు ఇతర దేశాల నుండి దిగుమతి చేస్తుందని . ఎల్ పీ జీ, పెట్రోల్ వాడకాన్ని తగ్గించిండంతో దేశానికి కూడా మంచి చేసినోల్లమైతమని హితవు పలికారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ కూడా నూనె గింజల పంటలను మన దేశంలోనే పండించాలని రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నే వికారాబాద్ జిల్లా, నవాబుపేట మండలం, లింగంపల్లి గ్రామంలో మహిళలకు, పెద్దలకు, యువతకు బయోమాస్ పెల్లెట్స్ వుడ్ గ్యాసిఫయర్ స్టవ్ ఎందుకు ముఖ్యమో అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ళ మాజీ ఎమ్మెల్యే కె. ఎస్. రత్నం, లింగంపల్లి సర్పంచ్ వి. శోభ పరమేశ్వర్, ఉప సర్పంచ్ ప్రవీణ , నాయకుడు శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎం.పి.టి.సి. పరమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్,నాయకుడు ప్రభాకర్ రెడ్డి, వార్డ్ సభ్యులు పాండురంగం, పాండు, గౌతమి, పావని తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ ఇళ్ల సముదాయాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



**కుత్బుల్లాపూర్, మే 18 (నినాదం) :** మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే శ్రీ కేపీ. వివేకానంద్ హాజరయ్యారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్, నిజాంపేట్, బాచుపల్లి, కైసర్ నగర్ తో పాటు అన్నీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో సీలింగ్, రూఫ్ లీకేజీల కారణంగా నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, వెంటనే మరమ్మతులు చేపట్టి నివాసయోగ్యమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను కోరారు. ఆయా ఇళ్ల సముదాయాల్లో నివసిస్తున్న ప్రజల ఆధ్యాత్మిక, సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రార్థనా మందిరాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని సూచించారు. ప్రజల అవసరాల మేరకు వైకుంఠ ధామాల ఏర్పాటుకు తగిన స్థలాలను గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు. పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పేద ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. అదనంగా పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు చెత్త సకాలంలో తొలగింపు, కాలనీల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరాను నిరంతరాయంగా అందించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే అభివృద్ధి చేయాలని అధికారులను ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కోరారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పని చేసి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలను ఆదర్శవంతమైన నివాస సముదాయాలుగా తీర్చిదిద్దాలని ఆయన వివరించారు.

## ఉద్యోగుల శిక్షణ వృథా ఖర్చు కాదు.. ఒక పెట్టుబడి

: ఎస్కి డైరెక్టర్ డా. రామేశ్వర్ రావు




**రాజేంద్రనగర్, మే18 (నినాదం):** ఉద్యోగుల వృత్తి జీవితంలో వారి ఎదుగుదలకు అందించే కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ప్రభుత్వానికి పెట్టుబడిలాంటిదే గానీ, అనవసర ఖర్చు కాదని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా. జి. రామేశ్వర్ రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, ఎస్కికి చెందిన వివిధ విభాగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ఎస్కి ప్రాంగణంలో ప్రారంభమైంది. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ కింద దేశంలోని వివిధ రాష్ట్రాల డిస్కంలలో పనిచేస్తున్న 2,500 మంది మిడిల్ లెవల్ మేనేజ్‌మెంట్ ఇంజినీర్లకు గత 11 నెలలుగా ఎస్కి ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పవర్ క్వాలిటీ, సైబర్ సెక్యూరిటీ, ఫైర్ సేఫ్టీ వంటి కీలక అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే మధ్యప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ , కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ అధికారులకు కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. గత నాలుగున్నర దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న ఎస్కి.. తొమ్మిది సార్లు గోల్డెన్ పీకాక్ అవార్డులను అందుకుందని ఆయన గుర్తుచేశారు. ఇరిగేషన్ ఇంజినీర్ల కోసం డ్యామ్ సేఫ్టీ, వరద నిర్వహణ అంశాలపై కూడా నేటి నుంచే ప్రత్యేక శిక్షణ ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 100 మందికి పైగా మిడిల్ లెవల్ మేనేజ్‌మెంట్ ఇంజినీర్లతో పాటు ఎస్కి ప్రతినిధులు డా. ఐ.ఎస్.ఎన్. రాజు, ఎస్. లక్ష్మీకాంత రావు, పి. రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## సంకల్ప యాత్రలో గడప గడపకు భారతీయ జనతా పార్టీ

బిజెపి రాష్ట్ర మున్సిపల్ సేల్ కో కన్వీనర్ గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి.





**కుత్బుల్లాపూర్, మే 18 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ మహాదేవపురం, గణేష్ గడ్డలో 15వ రోజు గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ బిజెపి స్టేట్ మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరి చేపట్టిన గడపగడపకు బిజెపి సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహంకాళి జిల్లా ఇన్చార్జ్ నందనం దివాకర్, జిల్లా కో కన్వీనర్ పద్మన్న, జెకె శేఖర్ యాదవ్, గరిక శేఖర్ ముదిరాజ్ హాజరై బీజేపీ జండా ను ఆవిష్కరించి సంకల్ప యాత్ర ను ప్రారంభించారు, గడపగడపకు బిజెపి కార్యక్రమంలో' భాగంగా ప్రతి ఇంటినీ సందర్శించి, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. సంకల్ప యాత్రలో గడపగడపకు బిజెపి కార్యక్రమంలో ప్రజల ఆశీస్సులు, మోదీ పాలనపై వారి నమ్మకం అద్భుతంగా ఉన్నాయని బిజెపి నేతలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జగన్, మణికుమార్ ,శ్రీకాంత్, బావిగడ్డ రవి, రఘుపతి, హనుమాన్, కేశవ్ యాదవ్, లోకేష్ రెడ్డి, పి శ్రీనివాస్ రెడ్డి,కంది శ్రీరాములు, యాదగిరి యాదవ్ , రమేష్, పత్తి సతీష్, మురళీకృష్ణ, సమం తల రాజు, రావుల రాజు ,రావుల పృథ్వి, జోగారావు ,మహేం దర్ రెడ్డి, శంకర్ ,రిషి, సత్యనారాయణ, వెంకటేష్ ,కార్తీక్ ,జగదీష్, యాదిరెడ్డి ,చిన్న మురళి, పీ.కే పాడి , శ్రీనివాస్, బాలకృష్ణ, రాజేష్ చారి ,మహిపాల్ రెడ్డి, భానుచందర్ ,కృష్ణ, కుమార్ యాదవ్, సాయి ప్రతాప్, నరేష్ గౌడ్ ,అరుణ్ ,జి. భాస్కర్ , గుండురావు, మంజునాథ్, పలసరవి, చరణ్ , వెంకట్ రెడ్డి, దుర్యోధనరావు, రమేష్, శ్రీనివాస్ రావు, ఎల్ బి రెడ్డి, సతీష్, నాగేష్, మహిళా మోర్చా శారదా, రమాదేవి ,సరోజా, లలితా, భవాని ,లక్ష్మీ ,చిన్న రమాదేవి, మహాదేవపురం కమిటీ సభ్యులు పద్మావతి సునీల్ కుమార్ శ్రీ కుమార్ , గురు ప్రసాద్, కొండల్ రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్ చారి, శారద, శశిధర్ రెడ్డి, ప్రసాద్, విజయ్, వీరయ్య, అనిల్, రవి, కాలనీ సభ్యులు, తదితర నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలి

దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ



**దుబ్బాక, మే 18( నినాదం) :** సిద్ధిపేట జిల్లా దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆశా వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జఖుఖ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ప్రవీణ్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ప్రతి నెల 1వ తేదీన పారితోషికాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆశా వర్కర్లకు నెలకు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. వీరిలో అధిక శాతం మహిళలు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. అయినప్పటికీ ఆశా వర్కర్లకు ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు కనీస గ్యారెంటీ ఫిక్స్డ్ వేతనం కూడా ఇప్పటివరకు ప్రభుత్వం నిర్ణయించలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజుల పాటు నిరవధిక సమ్మె నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో అప్పటి ప్రభుత్వం పలు హామీలు ఇచ్చిందని, అనంతరం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఆశా వర్కర్ల వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటికీ హామీలు అమలు కాలేదని ఆరోపించారు. ఆశా వర్కర్లకు రూ.50 లక్షల బీమా, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి హామీలు కూడా అమలులోకి రాలేదన్నారు. అదేవిధంగా పీఆర్సీ ఎరియర్స్, లెప్రసీ, పల్స్ పోలియో, ఎన్నికల డ్యూటీకి సంబంధించిన బకాయిలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి చి. భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్లు బాలమణి, సరస్వతి, రాజకళ, వినోద, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక ప్రమాధాలపై విజయవంతంగా ముగిసిన మాక్ ఎక్సర్ సైజ్


నిశితంగా పర్యవేక్షణ చేసిన అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీ

పాశమైలారం లోని బయోకాన్ లిమిటెడ్‌లో కొనసాగిన మాక్ డ్రిల్

అత్యవసర సమయాల్లో అప్రమత్తత ద్వారా నష్టాన్ని నివారించవచ్చు

అదనపు కలెక్టర్ పాండు, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి





**సంగారెడ్డి బ్యూరో, మే 18 (నినాదం):** పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించిన సమయాలలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో సన్నద్ధతను తెలుసు కునేందుకు వీలుగా సోమవారం సంగారెడ్డి జిల్లాలోని బయోకాన్ లిమిటెడ్ పాశమైలారంలో చేపట్టిన మాక్ ఎక్సర్ సైజ్ విజయవంతంగా పూర్తయింది. అదనపు కలెక్టర్ పాండు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్ జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సమాయత్తం అయి ఉందన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా తెలిసింది. విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు వాస్తవికతను తలపించేలా ఉన్నాయి. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, పారిశ్రామిక ప్రమాదాల సమయాలలో ఏవిధంగా వ్యవహరించా లన్నది ఆచరణాత్మక రూపంలో చేసి చూపించారు. అంబులెన్స్ లు,అగ్నిమాపక శకటాలు, వైద్య బృందాలు, పోలీస్, రెవిన్యూ, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు చేపట్టిన సహాయక చర్యలు విపత్తుల నిర్వహణపై సన్నద్ధతను చాటి చెబుతూ ప్రజల్లో, పరిశ్రమ కార్మికుల్లో నమ్మకాన్ని పెంపొందింపజేశాయి. ఆయా శాఖల అధికారులతో పాటు ఎస్.డీ ఆర్ ఎఫ్ బృందం మాక్ డ్రిల్ విజయవంతానికి దోహదపడ్డారు. పోలీస్, ఫైర్, రెవెన్యూ, , హెల్త్, విద్యుత్, పరిశ్రమలు తదితర అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ మాక్ ఎక్సర్ సైజ్ ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో అప్రమత్తతతో నష్టాన్ని నివారించవచ్చని అన్నారు. అన్ని శాఖల అధికారులు, కంపెనీ యాజమాన్యం, ఎన్ డీ ఆర్ ఎఫ్, ఉద్యోగుల సమన్వ యంతో మాక్ డ్రిల్ విజయవంతమైందన్నారు. అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, కంపెనీలో ఏర్పాటు చేసిన ఫైర్ ప్రొటెక్షన్ సిస్టమ్ సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. ఏ కంపెనీలోనైనా ప్రమాదం సంభవించిన వెంటనే సంబంధిత అధికారులు పోలీసు శాఖకు సమాచారం అందజేయాలని సూచించారు. అలాగే, కంపెనీ యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలకు వెంటనే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తొలి దశలో వేగంగా స్పందించడం వల్ల ప్రమాద తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని ఆమె తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది , ఆయా బృందాలు సమన్వయంతో పనిచేయడం వల్ల మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించగలిగామని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రాజేందర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు, పోలీస్ వైద్య ఆరోగ్య, పరిశ్రమలు రెవిన్యూ , విద్యుత్ శాఖ ల అధికారులు, బయోకాన్ కంపెనీప్రతినిధులు, కార్మికులు , తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్ ధరలు తగ్గించాలని ఆందోళన



**నూతనకల్,మే 18 (నినాదం):** పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై ఆదివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆందోళనకారులు ఆటోకు తాళ్లు కట్టి లాగి నిరాసన వ్యక్తం చేశారు. పెరిగిన పెట్రోల్,డీజిల్ ధరలతో ప్రజలపై అధిక భారం పడిందని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి అన్నారు. నాయకులు శ్రీనివాస్,ఉప సర్పంచ్ సురేందర్ రెడ్డి,అంజపల్లి లక్ష్మయ్య, తిరుమలేష్,విజయ్, బాలకృష్ణ,జగన్ రెడ్డి,జనార్దన్ రెడ్డి,రవి,బాలమల్లు పాల్గొన్నారు.

## ప్రతిరోజు యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం



**నూతనకల్,మే 18 (నినాదం):** యోగా శరీరం,మనసు,ఆత్మ మధ్య సమతుల్యతను సాధించే మార్గమని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. ఆదివారం ప్రజాపాలన- పురోగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో యోగాసనాలు,పైకే రన్ నిర్వహించారు.పలువురు ప్రముఖులు మాట్లాడుతూ యోగా మన భారతదేశ సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగమని,ఇది వేల సంవత్సరాల చరిత్ర కలిగిన జీవన విధానమని తెలిపారు.నేడు యోగ ప్రపంచవ్యాప్తంగా విస్తరించి,అన్ని దేశాల్లో ప్రజలు దీనిని ఆచరిస్తూ ఆరోగ్యానికి కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా,మనసు, ఆలోచనలు, జీవనశైలిని సానుకూల దిశగా మలిచే శక్తివంతమైన సాధనమని అన్నారు.ప్రతిరోజు యోగా సాధన చేయడం ద్వారా ఒత్తిడి,ఆందోళనలు తగ్గి,శరీరానికి శక్తి,మనసుకు ప్రశాంతత లభిస్తాయని వివరించారు.ఎంపీడీవో సునీత, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ,సర్పంచ్ మల్లికార్జున్,ఉప సర్పంచ్ నాగం సరిత,యోగా టీచర్ అనిత,వివిధ శాఖ అధికారులు,పంచాయతీ కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**హన్మకొండ, మే18( నినాదం):** హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సోమవారం చుక్కల పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని 48 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.14,45,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పాలన అందిస్తోందన్నారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అత్యవసర వైద్య సహాయం అందిస్తూ ప్రభుత్వం మానవతా దృక్పథంతో పనిచేస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులకు దరి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్, మహిళా సంక్షేమ పథకాల ద్వారా సామాన్య ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ఎలాంటి విపత్తులైన ఎదుర్కొనేందుకు సన్నద్ధం

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి





**వనపర్తి ప్రతినిధి, మే 18 (నినాదం):** భవిష్యత్తులో సంభవించే ఎలాంటి విపత్తులనైన సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆదేశాలు, రాష్ట్ర విపత్తు స్పందన దళం సూచనల మేరకు వనపర్తి పట్టణంలోని నల్ల చెరువులో సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ వరదలు సంభవించిన సందర్భంలో ప్రజలను ఎలా రక్షించాలి, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా బృందాలు ఎలా పనిచేయాలనే అంశాలపై ఈ మాక్‌డ్రిల్ చేపట్టారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా వరదల కారణంగా నల్ల చెరువులో ముంపునకు గురై చిక్కుకున్న ప్రజలను ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, అగ్నిమాపక, పోలీస్ శాఖలు సురక్షితంగా రక్షించే చర్యలను ప్రదర్శించారు. స్పందనా బృందాలు సమన్వయంతో పనిచేస్తూ బోటు, లైఫ్ జాకెట్ల సాయంతో ప్రజలను రక్షించి, ప్రథమ చికిత్స అందజేసి అంబులెన్సులో సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు ఎస్పీ రాజేష్ మీనాతో కలిసి పరిశీలించి, సహాయక చర్యల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సమయంలో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ప్రజల్ని ఎలా కాపాడాలనే అంశంపై మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు సంసిద్ధత కోసం ఈ మాక్ డ్రిల్ అనేది ఎంతో ముఖ్యమైన ప్రక్రియ అని తెలిపారు. వరదలు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడే ఏడు ప్రదేశాలను జిల్లాలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 10 సెంటీమీటర్స్ పైన వర్షపాతం నమోదు అయితే నల్ల చెరువు ప్రాంతంలో వరద నీటితో అత్యవసర పరిస్థితి ఏర్పడే నేపథ్యంలో ఇక్కడ మోక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదల శాఖ, ఇతర ముఖ్యమైన శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలను సంసిద్ధతను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, డిఎస్పీ గిరి ప్రసాద్, ఇతర జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న మాక్‌డ్రిల్





### కార్యక్రమాన్ని పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్, డీసీపీ కవిత

**హనుమకొండ, మే18,(నినాదం):** హనుమకొండ నగరంలోని వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన మాక్ ఎక్సర్‌సైజ్ (డ్రిల్) ఆహుతులను ఆకట్టుకుంది. ప్రకృతి విపత్తులు, అర్బన్ ఫ్లడింగ్, పారిశ్రామిక ప్రమాదాల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం ఎలా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, సహాయక చర్యలు ఎలా చేపట్టాలి అనే అంశాలపై అవగాహన కల్పించే విధంగా ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహాత్ బాజ్‌పాయి, డీసీపీ కవిత, అదనపు కలెక్టర్ రవి, ఇతర ఉన్నతాధికారులు సమ్మయ్య నగర్, వివేక్‌నగర్, లష్కర్‌సింగారంలోని యూపీహెచ్‌సీ ప్రాంతాల్లో జరుగుతున్న సహాయక చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరంలోని ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో మాక్ డ్రిల్ నిర్వహణ కొనసాగింది. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, వైద్య, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. స్నేహనగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన స్టేజింగ్ పాయింట్ నుంచి రెస్క్యూ బృందాలు ఆయా ప్రాంతాలకు బయలుదేరాయి.జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) మార్గదర్శకాల ప్రకారం టీఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్-2, వివేక్‌నగర్, సమ్మయ్య నగర్, ప్రగతి నగర్, గోపాలపూర్ జవహర్ కాలనీ, టీవీ టవర్ కాలనీలలో సహాయక చర్యలు చేపట్టారు. ఎమర్జెన్సీ సైరన్లు మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని లైఫ్ బోట్స్, తాళ్లు, స్ట్రెచర్ల సహాయంతో సురక్షితంగా బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రాలకు తరలించారు.వివేక్‌నగర్‌లో వరద ముంపులో చిక్కుకున్న కాలనీవాసులకు డ్రోన్ల ద్వారా ఆహారం అందించి, అనంతరం రెస్క్యూ బృందాలు భవనాలపై నుంచి సురక్షితంగా కిందికి దింపి తరలించాయి. సమ్మయ్య నగర్‌లోని ముంపు ప్రాంత ప్రజలను ప్రత్యేక వాహనాల ద్వారా రిలీఫ్ క్యాంపులకు తరలించారు. బాధితులకు ధైర్యం చెబుతూ ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ బృందాలు సమర్థవంతంగా సహాయక చర్యలు నిర్వహించాయి.లష్కర్‌సింగారంలోని యూపీహెచ్‌సీకి బాధితులను తరలించి వైద్య సేవలు అందించారు. 108 అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు, ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రత్యేక వాహనాలు రంగంలోకి దిగి అత్యవసర సేవలను అందించాయి. స్టేజింగ్ ప్రాంతంలో లైఫ్ బోట్స్, అత్యవసర సామగ్రిని సిద్ధంగా ఉంచారు.స్నేహనగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు బెడ్లు, తాగునీరు, బిస్కెట్ ప్యాకెట్లు, అల్పాహారం, భోజన సౌకర్యాలు కల్పించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో వైద్య బృందాలు ఆరోగ్య సేవలు అందించాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి మాట్లాడుతూ హైదరాబాద్ ప్రాంతం ప్రధానంగా అర్బన్ ఫ్లడింగ్, ఫ్లాష్ ఫ్లడ్స్‌కు గురయ్యే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. గత ఐదేళ్లలో పలు సార్లు భారీ వరదలు సంభవించాయని గుర్తుచేశారు. గతంలో స్పందన అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే "ఫైర్ ఫైటింగ్ అప్రోచ్" తరహాలో ఉండేదని, ప్రస్తుతం ముందస్తు ప్రణాళిక, సమగ్ర సమన్వయం, బాధ్యతల విభజనతో కూడిన వ్యవస్థను అమలు చేస్తున్నామని తెలిపారు.ప్రత్యేక "ఇన్సిడెంట్ కమాండ్ పోస్ట్" ఏర్పాటు చేసి, ఒక కమాండర్ ఆధ్వర్యంలో సుమారు 12 విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రెస్క్యూ, రిలీఫ్, కమ్యూనికేషన్, వైద్య సేవల కోసం ప్రత్యేక బృందాలను సిద్ధం చేసి అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందనకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.విపత్తు సమయంలో ఆసుపత్రుల సిద్ధత, బాధితులకు తక్షణ వైద్య సేవలు, ప్రజల తరలింపు, సహాయక చర్యల నిర్వహణ వంటి అంశాలపై ఈ మాక్ డ్రిల్ ద్వారా ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖ సమన్వయం, ప్రజల సహకారం ద్వారానే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించగలమని స్పష్టం చేశారు.కమాండెంట్ ఎన్. రవి సారథ్యంలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్ కార్యక్రమం ద్వారా విపత్తు పరిస్థితుల్లో వివిధ శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన స్పందన, సహాయక చర్యల నిర్వహణపై ప్రాయోగిక అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, ఫిషరీస్, సమయపాలన శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలి

### ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



**భూపాలపల్లి జిల్లా: మే 18( నినాదం):** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్య జిల్లా కార్యదర్శి పైడిపల్లి రమేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సహాయ కార్యదర్శి మందాల రవీందర్ రెడ్డి హాజరైనారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక ఉద్యమాలు నిరాహార దీక్షలు ర్యాలీలు రైల్ రోకోలు వంటావార్పు కార్యక్రమాలు చేయడం జరిగింది అనేక కేసులతో జైలు పాలు అయి జైలు జీవితం గడిపినాము కావున ప్రభుత్వం మాకు 250 గజాల ఇంటి స్థలం ఉద్యమకారులకు 25000 పింఛన్ నెలకు ఇవ్వాలి ప్రభుత్వమే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి అని వారు అన్నారు అలాగే తెలంగాణ ప్రభుత్వం మమ్ములను గుర్తించి మాకు ఒక జీవో నెంబర్ రిలీజ్ చేయడం జరిగింది వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వం జీవో ఆర్టీ నెంబర్ 679 ను జారీ చేసింది. సాధారణ పరిపాలన శాఖ ఈ జీవోను విడుదల చేసింది.ఈ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అసువులు బాసిన, శారీరక వైకల్యం పొందిన లేదా జైలు జీవితం గడిపిన ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గుర్తింపు, సౌకర్యాలు కల్పించడం కమిటీ ఉద్దేశం కమిటీ చైర్మన్ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే. కేశవరావు ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.సభ్యులు మంత్రులు, ఎమ్మెల్సీలు ఇతర ప్రముఖులతో ఈ కమిటీ ఏర్పాటయింది. జరిగిందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల జిల్లా మహిళా అధ్యక్షురాలు గోపరాజు సాంబ లక్ష్మి. బొమ్మెర రాజేశ్వరి మేకల సంపత్, క్యాతరాజు సాంబమూర్తి,బండారి రవి, బట్టు రవి, గీస సంపత్,గాదం జయ, ఎద్దు పుష్ప, వాసాల స్వప్న,మహమ్మద్ అన్వేర్, యాళ్ల సురేందర్, సుర రాజేష్,పుట్టపాక పుష్ప తదితరులు. పాల్గొన్నారు.

# క్రీడలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది





### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వెల్లడి

**వనపర్తి ప్రతినిధి, మే 18 (నినాదం):** క్రీడల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తూ క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న యూత్, స్పోర్ట్స్ వారోత్సవాల సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వనపర్తిలో 2కే రన్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ 2కే రన్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్యఅతిథిగా హాజరై అదనపు ఎస్పీ రాజేష్ మీనాతో కలిసి జెండా ఊపి రన్ ప్రారంభించారు.బాలుర జూనియర్ కళాశాల మైదానం నుంచి బస్ డిపో మీదుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు ఈ 2కే రన్ సాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ 99 డేస్ ప్రజా పాలనలో భాగంగా యువజన, క్రీడల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు ఒక భాగంగా మారాలని సూచించారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉంటే మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉంటామని, అందరూ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వనపర్తి జిల్లాలో బాక్సింగ్ స్పోర్ట్స్ క్యాంప్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఏఎస్పీ రాజేష్ మీనా మాట్లాడుతూ క్రీడలను అలవాటు చేసుకోవడం వల్ల శారీరకంగా దృఢంగా ఉండడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫిట్నెస్ కలిగి ఉండాలని తద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోగలమని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న యువజన, క్రీడల వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్, స్పోర్ట్స్ వీక్, టూరిజానికి సంబంధించిన పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. యూత్, స్పోర్ట్స్ వారోత్సవాల్లో భాగంగా ఈ వారం ప్రతిరోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన, క్రీడల అధికారి తెలిపారు. యువతలో స్కిల్ డెవలప్మెంట్, యూత్ పార్లమెంట్, స్వచ్ఛదనం, పచ్చదనం, వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న యువతకు సన్మాన కార్యక్రమాలు వంటివి వారోత్సవాల రోజువారి కార్యక్రమాల్లో భాగంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ బాలాజీ నాయక్, అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదవ తరగతి మిత్రులతో కలిసి సర్పంచ్ శ్రమదానం

### కలిసికట్టుగా కదులుదాం ఊరును పరిశుభ్రంగా ఉంచుకుందాం

### ఊరు కోసం ఒక్కరోజు శ్రమదానం : సర్పంచ్ పబ్బు సతీష్

### శ్రమ మదానంతో డ్రైనేజీలు రోడ్లు శుభ్రం



**కమలాపూర్, మే18 (నినాదం):** కలిసి కట్టుగా కదులుదాం ఊరును పరిశుభ్రంగా ఉంచుకుందాం జన్మనిచ్చిన ఊరు కోసం,ఒక్కరోజు శ్రమదానం చేసి గ్రామాన్ని బాగు చేసుకుందామని అనే నినాదంతో కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ పిలుపు నిచ్చారు. బాగు కోసం, మనందరి ఆరోగ్యం కోసం మీ విలువైన సమయంలో కేవలం ఒక్క రోజును కేటాయించాలని కమలాపూర్ యువతీ, యువకులకు, గ్రామ ప్రముఖులకు గ్రామ సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. గ్రామ పారిశుధ్య పరిరక్షణ స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా కమలాపూర్‌ను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఊరి కోసం ఒక్క రోజు (శ్రమదానం) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ తో పదవ తరగతి చదివిన మిత్రులు, బాల్య మిత్రులు సహా వార్డు సభ్యులు, పారిశుధ్య సిబ్బంది, గ్రామస్తులతో కలిసి శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. డ్రైనేజీలు, రోడ్లు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ. పెద్ద గ్రామం తక్కువ పారిశుధ్య సిబ్బంది ఉండటంతో పారిశుద్ధ్య పరిరక్షణ సవాలుగా మారిందన్నారు. గ్రామంలో పారిశుధ్య పరిరక్షణలో గ్రామస్తులను భాగస్వాములను చేయాలని ఉద్దేశంతో ఊరి కోసం ఒక్కరోజు శ్రమదానం కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. గ్రామ పంచాయతీ పిలుపు మేరకు కమలాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1994-95 విద్య సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు 2 వార్డులో శ్రమదానం నిర్వహించారన్నారని తెలిపారు. ఒక్కరోజు గ్రామంలో శ్రమదానం నిర్వహించి గ్రామస్తులను పారిశుద్ధ్య పరిరక్షణ వైపు చైతన్యవంతులు చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. మురుగు కాలువల శుభ్రత, చెత్తాచెదారం తొలగింపు, మొక్కల సంరక్షణ ముఖ్య ఉద్దేశ్యంగా ఈ కార్యక్రమం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధిని కాంక్షించే ప్రతి యువతీ యువకుడు, గ్రామస్తులు వారంలో ఒక రోజు మన ఊరి కోసం శ్రమిద్దాం అని తెలిపారు. రండి, మాతో చేతులు కలిపి వారంలో ఒక రోజు శ్రమదానం చేసి మన గ్రామాన్ని ఆదర్శ గ్రామంలా మార్చుకుందామని సర్పంచ్ పబ్బు సతీష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పదవ తరగతి మిత్రులు, వార్డు సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా జాగృతి కళాశాల

### ఎప్సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులతో ప్రభంజనం



**వనపర్తి ప్రతినిధి, మే 18 (నినాదం):** పరీక్షలు ఏవైనా జాగృతి కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధిస్తూ నంబర్ వన్ స్థానంలో నిలుస్తూ రికార్డు సృష్టిస్తున్నారు. ఆదివారం విడుదలైన టిజి ఎప్సెట్- 2026 ఫలితాల్లో వనపర్తి జిల్లా కేంద్రంలోని జాగృతి కళాశాల విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో సిహెచ్.అర్జున్ 4445 ర్యాంకు, రాహుల్ 4972 ర్యాంకు సాధించి జిల్లాలో సరికొత్త రికార్డును సృష్టించి జిల్లాలో నెం.1 గా నిలిచారు. అదే విధంగా మీనా 13363, అగ్రికల్చర్ విభాగంలో కె.శిల్ప 10564, ఎన్.అర్చన 14698 వంటి అత్యుత్తమ స్టేట్ ర్యాంకులు సాధించారు. 5 వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఇద్దరు,15 వేల లోపు ర్యాంకులు ఐదుగురు. 30 వేల లోపు ర్యాంకులు 15 మంది విద్యార్థులు సాధించారు. టీజీ ఎప్సెట్ లో 123 మంది కోచింగ్ తీసుకోగా 96 మంది విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగాల్లో అర్హత సాధించి వనపర్తి జిల్లాలో సరికొత్త రికార్డుతో సంచలనం సృష్టించారు.
రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకులను సాధించిన విద్యార్థిని, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్ కుమార్, యజమాన్య సభ్యులు శ్యామ్ కుమార్, సత్యనారాయణ, భాస్కర్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం బొకే, శాలువాలతో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్ విద్య అంటే కేవలం ఐపిఈ మార్కులే కాదు జేఈఈ, నీట్, ఎప్సెట్ అని చెప్పారు. మా కళాశాల విద్యార్థులు ఎటువంటి లాంగ్ టర్మ్ కోచింగ్ లేకుండా రెగ్యులర్ ఇంటర్ విద్యతో పాటు జేఈఈ, నీట్, ఎప్సెట్ బ్యాచులను సమర్థవంతంగా నిర్వహిస్తూ కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యను అందిస్తున్నామని చెప్పారు. సాధారణ విద్యార్థులతో రాష్ట్ర, జాతీయ స్థాయి ర్యాంకులను సాధిస్తూ ఉమ్మడి జిల్లాలో సంచలనాలు సృష్టిస్తున్న ఏకైక కళాశాల జాగృతి కళాశాల అని ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు. అదే విధంగా ఐపిఈ పాస్ పర్సెంటేజ్ లో కూడా నంబర్ వన్ స్థాయిలో ఉందని తెలియజేసేందుకు ఎంతో సంతోషిస్తున్నామని ఆయన అన్నారు. తక్కువ మంది విద్యార్థులతో కార్పొరేట్ ప్రణాళికా, మెటీరియల్ తో 26 సంవత్సరాల అనుభవం గల కార్పొరేట్ స్థాయి అధ్యాపకులతో జేఈఈ, నీట్, ఎప్సెట్ బ్యాచులను సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన చెప్పారు. దీనికి నిదర్శనమే ఈ ఫలితాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



**మహాదేవపూర్ మే 18, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాపు, స్థానిక సర్పంచ్ హసీనాబానులు పునః ప్రారంభించారు. గత కొంతకాలంగా మండల కేంద్రంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ మూతపడగా దానిని తిరిగి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఏపీఎం రాజన్న, ఐకెపి మండల మహిళా అధ్యక్షురాలు తుంగల సరిత, మహిళా శక్తి సభ్యులు, వివోలు, సిఏలు పాల్గొన్నారు.

## రైతు ముంగిట శాస్త్రవేత్తలు.. పంటలపై అవగాహన



**కమలాపూర్ మే 18 (నినాదం):** మండలంలోని పంగిడిపెల్లి గ్రామంలో వ్యవసాయ కళాశాల, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ వారి అధ్వర్యంలో వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు రైతు ముంగిట శాస్త్రవేత్తలు అనే రైతు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేద్య పరిజ్ఞాన శాస్త్రవేత ఎ సతీష్ మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించడం, అవసరం మేరకు వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడలన్నారు. పచ్చి రొట్ట ఎరువుల ప్రాధాన్యం, వివిధ పంటల్లో సాగునీటిని ఆదా చేయడానికి ఉపయోగించే పరిజ్ఞానాన్ని పంట మార్పిడి యొక్క ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. వృక్ష వ్యాధి శాస్త్ర శాస్త్రవేత్త యశస్వినీ వివిధ పంటల లో వచ్చే తెగుళ్లు ఆశించే పురుగులు వాటి నివారణ చర్యలను, వివిధ రకాల జీవ నియంత్రణ కారకాలను, వాటిని ఉపయోగించడం వలన పర్యావరణశీ లో జరిగే మార్పులను గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి బి వేణు ఎరువుల యాజమాన్యం, నేల ఆరోగ్యాన్ని కాపాడడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు , జనుము, జీలుగా విత్తన లభ్యత రాష్ట్ర ప్రభుత్వం నుండి లభించే సబ్సిడీలతో పాటుగా పలు విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జయప్రకాష్ రెడ్డి,సర్పంచ్ వలిగే కళ్యాణి యుగంధర్, ఉప సర్పంచ్ శ్రీకాంత్,ప్రోగ్రెసివ్ ఫార్మర్ సాంబయ్య , వ్యవసాయ కళాశాల విద్యార్థులు,పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్‌లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

## రైతుల ఖాతాల్లో రూ.237 కోట్లు జమ, వచ్చే వారం లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్, మే 18(నినాదం)**

కరీంనగర్ జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 319 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు వచ్చిన ధాన్యంలో 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని వెల్లడించారు. రైతులకు సంబంధించి రూ.237 కోట్ల చెల్లింపులు ఇప్పటికే వారి ఖాతాల్లో జమయ్యాయని పేర్కొన్నారు. వరి, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, రైస్ మిల్లర్లు, రవాణా సంఘాల ప్రతినిధులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ సీజన్‌లో జిల్లాకు 3.61 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వచ్చే అవకాశం ఉందని, ఇప్పటివరకు 3 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిందని తెలిపారు.ఇందులో 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. అధికారులు సమన్వయంతో పని చేయడంతో వారం రోజుల్లోనే రికార్డు స్థాయిలో 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు సాధ్యమైందన్నారు. వచ్చే వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.ధాన్యం రవాణా, హమాలీల కొరత వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ధాన్యం లోడుతో వెళ్లే ప్రతి వాహనం 24 గంటల్లోపు మిల్లులకు చేరి అన్‌లోడ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోళ్లలో కరీంనగర్ జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన 78 శాతం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు పూర్తయ్యాయని, 88 శాతం ధాన్యాన్ని మిల్లర్లు స్వీకరించారని తెలిపారు.ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ,పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం, ఎంఎల్ఏలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ,గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం

## ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ

**సంగారెడ్డి బ్యూరో, మే 18 ( నినాదం)**

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విన్న ఎస్పీ, సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోయిన పక్షంలో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అలాగే మధ్యవర్తులను నమ్మకుండా, తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

# ఈఏపీసెట్‌లో విజయఢంకా మోగించిన అల్ఫోర్స్ విద్యార్థులు

## వెయ్యిలోపు 32 ర్యాంకులు.. ఐఐటీ అడ్వాన్స్‌డ్‌కు 450 మంది అర్హత





కరీంనగర్‌లో అల్ఫోర్స్‌కు అపూర్వ ఘనత

ఇటీవల ప్రకటించిన ఐఐటీ మెయిన్స్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన అల్ఫోర్స్ విద్యార్థులు

అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, మే18 (నినాదం)**

ఆదివారం రోజున విడుదలైన ఈఏపీసెట్ 2026 ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి కరీంనగర్ విద్యా చరిత్రలో అరుదైన విజయాన్ని నమోదు చేశారు. వ్యవసాయ, ఫార్మసీ విభాగంలో డి. రిత్విక్ 11వ ర్యాంకు సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో పి. చరణ్ 22వ ర్యాంకుతో మెరిశారు. అలాగే సి.హెచ్. లక్ష్మీ హాసిని 74, నిదా 157, పి. అక్షయ 251, ఎల్. అర్యన్‌రావు 252, మహ్మద్ హుస్సేన్ 272, వి. రుచిత 293, ఏ. నాగసింధు 330, బి. అభిఘ్న 430, వి. సుహాసిని 439, వి. శ్రేయస్ రెడ్డి 487 ర్యాంకులు సాధించి సంస్థకు కీర్తి తీసుకొచ్చారు.ఈ ఫలితాల్లో 32 మంది విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించడం విశేషం. అలాగే 57 మంది రెండు వేలలోపు, 88 మంది మూడు వేలలోపు, 127 మంది నాలుగు వేలలోపు, 169 మంది ఐదు వేలలోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ ప్రతిష్ఠను మరింత పెంచారు. తక్కువ మంది విద్యార్థులతోనే అత్యుత్తమ ఫలితాలు సాధించడం అల్ఫోర్స్ ప్రత్యేకతగా నిలిచిందని సంస్థ పేర్కొంది.ఇటీవల ప్రకటించిన ఐఐటీ మెయిన్స్ ఫలితాల్లో కూడా అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని, 450 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించడం మరో ఘనత అని సంస్థ చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. పటిష్ట బోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.ఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఆయన అభినందించారు.


# ఈపీసెట్ 2026లో ఎంజేపి విద్యార్థుల హవా

**516 ర్యాంక్ సాధించిన హర్షిణి**

- అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఐదు వేల లోపు ర్యాంక్ 43 మంది విద్యార్థులు
- పదివేల లోపు ర్యాంక్ 122 మంది విద్యార్థులు, 1626 మంది విద్యార్థులు క్వాలిఫై
- ఇంజనీరింగ్ లో 10వేల లోపు ర్యాంకు సాధించిన 56 మంది విద్యార్థులు, 2155 మంది విద్యార్థులు క్వాలిఫై
- విద్యార్థులను అభినందించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్య కార్యదర్శి బాలమాయాదేవి, ఎం జె పి కార్యదర్శి బడుగు సైదులు


అనిరుధ్


రుషిక్ వర్మ


హిమబిందు


అంకిత


వినోద్ కుమార్


హర్షిణి



హర్షిణి


కె. శ్రవణ్ కుమార్


నవ్య


సుప్రియ


ముత్తవ్వ


ఝాన్సీ


హిమనీ

**హైదరాబాద్ బ్యూరో మే 18 (నినాదం ) :**

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ విద్యార్థులు ఈఏపీసెట్-2026 ఫలితాల్లో హావా కనబరిచారు. అగ్రికల్చర్ , ఫార్మసీ మరియు ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నత విద్యా కోర్సుల కోసం నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో 3781 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. వీరిలో ఐదువేల లోపు ర్యాంక్ 46మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ 178 మంది విద్యార్థులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హర్షిణి (516వ ర్యాంక్), కల్పిత (1315 ర్యాంక్), కె. శ్రవణ్ కుమార్ (1377 ర్యాంక్), టి. నవ్య(1692 ర్యాంక్) అత్యుత్తమ ర్యాంక్ సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో బి. అనిరుధ్ (3513 ర్యాంక్ ), జి. వినోద్ కుమార్ (3568 ర్యాంక్ ), ఎన్. రుషిక్ వర్మ (4433 ర్యాంక్) సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మొత్తం 1626 మంది ఎంజెపి విద్యార్థులు క్వాలిఫై కాగా వీరిలో ఐదు వేల లోపు ర్యాంక్ సాధించిన వారు 43 మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ సాధించిన వారు 122 మంది విద్యార్థులు ఉన్నారు. 20000 లోపు ర్యాంక్ 247 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 703 మంది విద్యార్థులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2155 మంది విద్యార్థులు క్వాలిఫై కాగా వారిలో 5000 లోపు ర్యాంక్ ముగ్గురు విద్యార్థులు, 10000 లోపు ర్యాంక్ 56 మంది విద్యార్థులు, 20000 లోపు ర్యాంక్ 167 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 412 మంది విద్యార్థులు సాధించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు అర్హత సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ముఖ్య కార్యదర్శి బాల మాయా దేవి గారు, ఎం జె పి కార్యదర్శి బడుగు సైదులు గారు అభినందించారు. ఈ ఫలితాలు బీసీ గురుకుల విద్యాసంస్థల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు మెరుగు పరిచామని, ప్రత్యేక ఆన్ లైన్ కోచింగ్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల శిక్షణ అందిస్తున్నామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు సి ఓఇ (కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్) మాత్రమే ఉండగా గత ఏడాది కొత్తగా పది సిఓఇలు లు, ఈ ఏడాది మరో పది సిఓఇలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో బీసీ గురుకుల విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సులకు శిక్షణ తీసుకుని అత్యుత్తమమైన ఫలితాలు సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు.

# ఎస్ఐహెచ్ఎంకు పూర్వ వైభవం తీసుకువస్తాం

## మంత్రి జూపల్లి కృష్ణారావు

### జహీరాబాద్‌లో ఘనంగా పర్యాటక వారోత్సవాలు

### బేకరీ కోర్సులు, నిథమ్ లో బీబీఏ, ఎంబీఏ అడ్మిషన్ల ప్రారంభం

### పేద విద్యార్థులకు స్టైఫండ్ ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి



**సంగారెడ్డి బ్యూరో , మే 18 (నినాదం)**

జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం) సంస్థను కార్పొరేట్ స్థాయిలో బలోపేతం చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు చేయనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఎస్ఐహెచ్ఎంలో ఘనంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నూతనంగా ప్రవేశపెట్టిన బేకరీ, కన్ఫెక్షనరీ కోర్సులను మంత్రి ప్రారంభించారు. వీటితో పాటు నిథమ్ (NITHM) విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ, ఎంబీఏ కోర్సుల అడ్మిషన్లను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు, పర్యాటక శాఖ రూపొందించిన 'టూరిస్ట్ గైడ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు.

**గ్రామీణ యువతకు స్వయం ఉపాధే ధ్యేయం**

అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెచ్ఎంను పునః ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించి, వారి కాళ్లపై వారు నిలబడేలా చేయాలనే ఉద్దేశంతో దశాబ్దాల క్రితం ఈ సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ఎస్ఐహెచ్ఎంలో చేరిన పేద విద్యార్థులకు ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు, వారికి స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం తగిన కృషి చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిన ఈ యుగంలో, ప్రైవేట్ రంగంలో పుష్కలంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. యువత ఈ అవకాశాలను అందుకోవడానికి పర్యాటక, ఆతిథ్య (హాస్పిటాలిటీ) రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు కేవలం కోర్సులకే పరిమితం కాకుండా భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, విదేశీ భాషలను కూడా నేర్చుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఆధునిక కోర్సులను కరిక్యులమ్‌లో చేర్చాలని నిథమ్ డైరెక్టర్ వెంకటరమణను మంత్రి ఆదేశించారు. పిల్లల ఉపాధి కోర్సుల విషయంలో తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, మాజీమంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ లు,తదితర అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# డేటింగ్‌లో శ్రీలీల, తిలక్ వర్మ?


## రూమర్స్‌ను ఖండించిన తల్లి స్వర్ణలత



నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలు జోరందుకున్నాయి. దీంతో శ్రీలీల తల్లి స్వర్ణలత వాటిని ఖండిస్తూ శ్రీలీల పెళ్లికి ఇంకా సమయం ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం. ఇలాంటి కథలు ఎలా పుట్టుకొస్తాయో తెలియట్లేదు. ఈ వార్తలలో అణువంత కూడా నిజం లేదు. శ్రీలీల ప్రస్తుతం తన చదువు, యాక్టింగ్‌లో బిజీగా ఉంది. ఏ మాత్రం విరామం దొరికినా నీట్-పీజీ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతోంది. ఇలాంటి వ్యక్తిగత విషయాల గురించి ఆలోచించడానికి ఆమెకు మరో ఐదారు సంవత్సరాల సమయం ఉందని స్పష్టతనిచ్చారు. 2025 డిసెంబర్‌లో శ్రీలీల-తిలక్ ఇద్దరూ తిరుమలను సందర్శించడం, వాంఖడే టీ20 మ్యాచ్‌లో నటి సందడి చేయడం.. ఇవి రెండూ ఉద్దేశపూర్వకంగా జరగలేదని ఆమె అన్నారు. వాటి ఆధారంగా కథలు అల్లుకుపోవద్దని కోరారు. గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు స్వర్ణలత ఖండించారు. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు బీటౌన్‌లో కథనాలు రాగా వాటిని ఖండించారు.

# పెద్దికి సెన్సార్ క్లియరెన్స్

## 3 గంటల రన్ టైమ్ అంటూ ప్రచారం



రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది విడుదలకు సిద్ధమవుతోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై నిర్మాత వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్టపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదల దిశగా మరో అడుగు ముందుకు వేసింది. చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి అధికారిక క్లియరెన్స్ లభించినట్లు సమాచారం.

NINADAM CINEMA



# టాక్సిక్ విడుదల మరింత జాప్యం

## కారణాలను వెల్లడించిన హీరో యశ్

యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్'. దీని విడుదల కోసం అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల గురించి తాజాగా యశ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని రిలీజ్ విషయంలో హాలీవుడ్ తరహా ప్రణాళికలు ఫాలో అవుతున్నట్లు చెప్పారు. అది ఇక్కడి వాళ్లకు నచ్చకపోవచ్చని కానీ, తాను ఏం చేసినా అభిమానుల కోసమేనని అన్నారు. ఓ హాలీవుడ్ మ్యాగజైన్ కవర్ ఫొటోకు పోజిలిచ్చిన యశ్.. దానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'టాక్సిక్' వాయిదాల గురించి మాట్లాడారు. ఆ సినిమా అంతర్జాతీయ స్థాయిలో విడుదల కానుంది. మేం అన్ని ప్రాంతాలను దృష్టిలోపెట్టుకుని విడుదలను ప్లాన్ చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కోసం మేము తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలు, సాధారణంగా మన దేశంలో సినిమా విడుదల పద్ధతులకు పూర్తి భిన్నంగా ఉంటాయన్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787